

నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు

బుధవారం

18 ఫిబ్రవరి 2026 పేజీలు : 08


# 26న మేయర్ ఎన్నిక



- ప్రత్యేక సమావేశంపై కార్పొరేటర్లకు సమాచారం ఇచ్చిన అధికారులు
- ఎన్నికల అధికారిగా జాయింట్ కలెక్టర్

**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :**



నగరపాలక సంస్థ మేయర్ ఎన్నికకు సంబంధించి రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నీలం సాహ్ని ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేయడంతో అధికారులు ఈనెల 26వ తేదీ మేయర్ ఎన్నికపై ఉదయం 11 గంటలకు నగర పాలక సంస్థ కార్యాలయంలోని డాక్టర్ ఏపీజే అబ్దుల్‌కలాం సమావేశ మందిరంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి నూతన మేయర్‌ను ఎన్నుకోనున్నారు. ఇందుకు సంబంధించి నగరపాలక కార్యదర్శి శ్రీలక్ష్మి.. నగరపాలక సంస్థకు చెందిన 53 మంది కార్పొరేటర్లు, నలుగురు ఎక్స్ అఫిషియో సభ్యులైన మున్సిపల్ శాఖ మంత్రి, నెల్లూరు ఎంపీ, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు ప్రత్యేక సమావేశం సంబంధించి నోటీసులను సిబ్బంది ద్వారా అందజేశారు. నగరపాలక సంస్థ మేయర్ పొట్లూరి స్రవంతి డిసెంబర్ 16వ తేదీ రాజీనామా చేసిన విషయం తెలిసిందే. దీంతో డిసెంబర్ 18వ తేదీ డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్ ఇన్చార్జి మేయర్‌గా బాధ్యతలు చేపట్టిన విషయం విదితమే. మాజీ మేయర్ స్రవంతి, గిరిజన నాయకులు నగరపాలక మేయర్ స్థానంలో గిరిజనులే ఉండాలని పట్టుబట్టి పలు కార్యక్రమాలు చేసిందీ కూడా తెలిసిందే. ఎట్టకేలకు ఎన్నికల కమిషన్ నగరపాలక సంస్థ మేయర్

-మిగతా 2లో






## ఉద్యానవన నర్సరీని ఏర్పాటు చేయాలి

- అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలి
- సంబంధిత అధికారులను ఆదేశించిన కలెక్టర్ హిమాన్షు శుక్లా



02

## డీఈఓను వెంటనే సస్పెండ్ చేయాలి

మార్చి 2 నుంచి రిలే నిరాహార దీక్షలు



02 పేజీలో

## సీఎం చంద్రబాబుతో వేమిరెడ్డి దంపతుల భేటీ

- కనిగిరి రిజర్వాయర్ ఆధునీకరణ పనులు చేపట్టండి
- ముదివర్తి - ముదివర్తిపాలెం వరకు కాజ్వే నిర్మాణ పనులను వేగవంతం చేయండి
- గంగపట్నం పల్లిపాలెం ఉప్పుటేరు వంతెన నిర్మాణానికి నిధులు కేటాయించండి
- సీఎంఆర్ఎఫ్ పెండింగ్ ఫైళ్లను పరిష్కరించి పేదలను ఆదుకోండి

కోవూరు నియోజకవర్గ సమస్యలపై ముఖ్యమంత్రి చంద్రబాబుకు వినతి



02 పేజీలో

## వైభవంగా మూలస్థానేశ్వరుని రథోత్సవం



లోపల పేజీలో




# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

- కార్పొరేటర్ కిన్నెర మాల్యాద్రి
- 7వ డివిజన్‌లో ఘనంగా 'ప్రజా దర్బార్' - అర్జీలు స్వీకరించిన కార్పొరేటర్
- అర్హులందరికీ పెన్షన్లు అందేలా చూస్తాం: కార్పొరేటర్ భరోసా
- మంత్రి నారాయణ ఆదేశాల మేరకు సమస్యల పరిష్కారానికి ముందడుగు
- మీ సమస్య - మా బాధ్యత.. ప్రజా దర్బార్ ద్వారా ప్రజలకు చేరువగా..



**నెల్లూరు అర్బన్/క్రైమ్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరంలోని 7వ డివిజన్‌లో మంగళవారం నిర్వహించిన 'ప్రజా దర్బార్' కార్యక్రమంలో కార్పొరేటర్ కిన్నెర మాల్యాద్రి పాల్గొని ప్రజల నుంచి స్వయంగా అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల సమస్యల తక్షణ పరిష్కారమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, మంత్రి పొంగూరు నారాయణ ఆదేశాల మేరకు ప్రతి వారం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ముఖ్యంగా కొత్త పెన్షన్ల కోసం వస్తున్న దరఖాస్తులను అధికారులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారని, ప్రభుత్వం నుంచి కొత్త జాబితా విడుదలైన వెంటనే అర్హులందరికీ న్యాయం జరుగుతుందని భరోసా ఇచ్చారు. అదేవిధంగా వచ్చే నెలలో ఈ ప్రజా దర్బార్‌ను 7/3 సెక్రటేరియట్ పరిధిలో నిర్వహిస్తామని వెల్లడిస్తూ, అధికారులు మరియు సచివాలయ సిబ్బంది ఈ కార్యక్రమంపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించాలని ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో డివిజన్ ఇంచార్జ్ కిన్నెర సాగర్,వైస్ ప్రెసిడెంట్ గులామ్ హుసేన్,యూనిట్ ఇంచార్జ్: వేణుగోపాల్ మరియు ఖాజావలి,జనరల్ సెక్రటరీ ప్రభాకర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ సురేష్, వై.టి.నాయుడు, టిడిపి నేతలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# 2026 జనవరి జేఈఈ మెయిన్స్ ఫలితాలలో విశ్వసాయి విజయాలు




**నెల్లూరు అర్బన్/క్రైమ్, మేజర్‌న్యూస్ :** లక్ష్యంతో చదవడం ఒక ప్రణాళిక ప్రకారం సాధన చేయడం ద్వారా ఎన్‌టిఏ విడుదల చేసిన జేఈఈ మెయిన్స్ ఫలితాలలో తమ విశ్వసాయి జూనియర్ కళాశాల విద్యార్థులు విజయదుందుభి మోగించారని కళాశాల చైర్మన్ డాక్టర్ ఎస్.సత్యనారాయణ మంగళవారం తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ కళాశాల విద్యార్థులు సిహెచ్ శరణ్య 97శాతం సాధించి జాతీయ స్థాయిలో అద్భుతమైన ప్రతిభ కనిపించారని అదేవిధంగా ఏడు మంది విద్యార్థులు 90 శాతం పైగా మరియు 36 మంది విద్యార్థులు 80 శాతం పైగా మొత్తం 56 మందికి విద్యార్థులు ఈ జేఈఈ మెయిన్స్‌లో క్వాలిఫై అయ్యారని ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు. అనంతరం వైస్ చైర్మన్ కృష్ణమోహన్, డైరెక్టర్ శివ సంకేత్ మాట్లాడుతూ.. విద్యార్థులకు మాక్ టెస్ట్‌లు నిర్వహిస్తూ డౌట్స్ క్లారిఫికేషన్ చేస్తూ ఉంటాం కాబట్టే.. ఈ ఫలితాలు సాధ్యమైనాయని వారు తెలియజేశారు. అధ్యాపక సహకారంతో రెండో విడత పరీక్షల్లోనూ అద్భుత పర్సంటేజ్ సాధించి జేఈఈ అడ్వాన్స్‌లో కూడా ఉత్తమ ఫలితాలతో విజయం సాధించగలరని ఆశాభావం వ్యక్తం చేశారు. అంతేకాకుండా క్రమశిక్షణ సీనియర్ అధ్యాపకులచే విద్య బోధన పర్యవేక్షణ వల్ల తాము ఈ విజయం సాధించగలిగామని వారికి ప్రత్యేక అభినందనలు ఈ సందర్భంగా తెలియజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్వై జూనియర్ కళాశాల డీన్లు, ప్రిన్సిపల్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

# సీఎం చంద్రబాబుతో వేమిరెడ్డి దంపతుల భేటీ



**నెల్లూరు అర్బన్/క్రైం, మేజర్‌న్యూస్ :** కోవూరు నియోజకవర్గంలోని పలు అభివృద్ధి పనులు, అపరిష్కృతంగా ఉన్న ప్రజా సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిలు అమరావతిలోని క్యాంప్ కార్యాలయంలో మంగళవారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును కలిశారు. ఈ సందర్భంగా కోవూరు నియోజకవర్గ పరిధిలోని పలు ప్రధాన సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. రైతాంగ ప్రయోజనాల దృష్ట్యా కనిగిరి రిజర్వాయర్ ఆధునీకరణ పనులను త్వరితగతిన చేపట్టాలని కోరారు. ముదివర్తి – ముదివర్తి పాలెం వరకు కాజ్వే నిర్మాణ పనులను వేగవంతం చేయాలని, అలాగే గంగపట్నం పల్లిపాలెం గ్రామంలో ఉప్పుటేరు వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని విన్నవించారు. బుచ్చిరెడ్డి పాళెం ఫైర్‌స్టేషన్‌కు కావాల్సిన అదనపు సిబ్బందిని వెంటనే నియమించాలని ఈ సందర్భంగా వేమిరెడ్డి దంపతులు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి విజ్ఞప్తి చేశారు. కాలం చెల్లిపోయిన సీఎం రిలీఫ్ ఫండ్ దరఖాస్తులను పరిశీలించాలని, నిరుపేదల వైద్య సదుపాయాలకు సంబంధించిన పెండింగ్ ఫైళ్లను త్వరితగతిన క్లియర్ చేయాలని వారు ముఖ్యమంత్రి చంద్రబాబును కోరారు. వేమిరెడ్డి దంపతులు విన్నవించిన అంశాలపై సానుకూలంగా స్పందించిన ముఖ్యమంత్రి చంద్రబాబు కనిగిరి రిజర్వాయర్, వంతెనల నిర్మాణానికి సంబంధించి సంబంధిత అధికారులతో మాట్లాడి తగిన చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు.

అలాగే సీఎంఆర్‌ఎఫ్ ఫైళ్ల క్లియరెన్స్‌కు సానుకూల నిర్ణయం తీసుకుంటామని భరోసా ఇచ్చారు. సీఎంను కలిసిన వారిలో నెల్లూరు నగర మేయర్ రూప్ కుమార్ యాదవ్ కూడా ఉన్నారు.

# 26న మేయర్ ఎన్నిక

*(మొదటి పేజీ తరువాయి)*

స్థానానికి ఎన్నికల నోటిఫికేషన్ ఇచ్చింది. దీంతో నగర పాలక సంస్థ మేయర్ ఎన్నికలకు సంబంధించి 26వ తేదీ ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఎన్నికల అధికారిగా జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లను నియమించారు. ఈనెల 20 తేదీలోగా కార్పొరేషన్ పాలకమండలి సభ్యులకు సమాచారం అందించాలని ఎన్నికల కమిషనర్ ఆదేశించడంతో నగరపాలక సంస్థ కౌన్సిల్ కార్యదర్శి ప్రత్యేక సమావేశానికి సంబంధించిన సమాచారాన్ని సిబ్బంది ద్వారా అందజేశారు. నగరపాలక సంస్థలో ఎక్కువ శాతం అధికార తెలుగుదేశం పార్టీకి చెందిన సభ్యులు ఉండడంతో, వారిలో 53వ డివిజన్‌కు చెందిన కార్పొరేటర్ దేవరకొండ సుజాతను నగరపాలక సంస్థ మేయర్‌గా ఎన్నుకునే అవకాశం ఉందని విశ్వసనీయ సమాచారం.

# డీఈఓను వెంటనే సస్పెండ్ చేయాలి

## మార్చి 2 నుంచి రిలే నిరాహార దీక్షలు

**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** దళిత గిరిజన పేద ఉపాధ్యాయుల హక్కుల కోసం ఉద్యమాలు చేసిన దళిత ఉపాధ్యాయుడు హాజరత్‌పై కక్ష సాధింపు చర్యలకు నిరసిస్తూ మార్చి 2 నుంచి డీఈఓ కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్షలు నిర్వహిస్తున్నట్లు దళిత గిరిజన హక్కుల పరిరక్షణ కమిటీ జేఏసీ నేతలు కెసి పెంచలయ్య, కొప్పాల రఘు తెలిపారు. ఈ మేరకు వారు మంగళవారం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో డిప్యూటీ డీఈఓ వారిని కలిసి నోటీసు అందజేశారు. సిహెచ్ హాజరత్ దళితుడైనందుకు చిన్న చూపుతో హైకోర్టు ఆదేశాలను సైతం తుంగలో తొక్కి ఉద్దేశపూర్వకంగా కక్ష సాధింపు చర్యలకు పాల్పడి తమిళనాడు సరిహద్దు సమీపంలో బీమునివారిపాలెంలో పోస్టింగ్ ఇవ్వడంపై తీవ్రంగా వ్యతిరేకిస్తునామన్నారు. ప్రస్తుతం విద్యాశాఖలో బదిలీలు, డిప్యుటేషన్లపై నిషేధం ఉన్నప్పటికీ ఉద్దేశపూర్వకంగా డీఈఓ సిహెచ్ హాజరత్ అనే ఉపాధ్యాయుడిని తమిళనాడు బార్డర్‌లో ఉన్న భీమునివారిపాలెం ఎంపీపీ స్కూల్‌కు బదిలీ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. డీఈఓను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జేఏసీ నేతలు సీనియర్ న్యాయవాది అరవ దొరస్వామి, పల్లం వెంకయ్య, దళిత బాబు, దుడ్డు రమేష్ బాబు, పుత్తూరు శ్రీనివాసులు, రోకటి బాబు, మహిళా నాయకులు చెంబెట్టి ఉష, నలగట్ల ప్రభావతి, జ్యోతి, పాముల కోటేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యానవన నర్సరీని ఏర్పాటు చేయాలి

**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** జిల్లాలో ఉద్యాన వన నర్సరీ ఏర్పాటుకు పెన్నా, సంగం బ్యారేజ్ పరిసర లేక మరేదైనా ప్రాంతంలో అనువైన ప్రదేశంలో 5 ఏళ్ల లీజు ప్రాతిపదికన అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టర్ కార్యాలయంలోని యస్ఆర్.శంకరన్ వీడియో కాన్ఫరెన్సు హాలులో ఉద్యాన వన శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మండల ఉద్యానవన శాఖ అధికారులు ఆయా మండలాలలో ఒక ప్రత్యేక థీంతో పని చేసి ఆ మండలాలకు గుర్తింపు వచ్చేలా చూడాలన్నారు. నిర్దేశిత లక్ష్యసాధన కాకుండా వినూత్నంగా ఆలోచించ వలసిన అవసరం ఉందని, తదనుగుణంగా నెల్లూరు జిల్లా వైపు అందరిని ఆకర్షించేలా చేయాలన్నారు. వ్యవసాయ శాఖ ప్రాధాన్యతా రంగాలలో ఉద్యాన వన శాఖ ఒకటన్నారు. కలువాయి, సైదాపురం, దుత్తలురులో ఉన్న కోల్డ్ స్టోరేజ్‌లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లాలో ఫాంపాండ్స్‌ను పెంచాల్సిన అవసరం ఉందన్నారు. అంతేకాకుండా పాలీ హౌసెస్‌లను పెంచాలని రాష్ట్రం మొత్తం నెల్లూరు వైపు చూసేలా ఉండాలన్నారు. ఉద్యాన వన అధికారులు శాస్త్రీయ దృక్పథం నుండి బయటికి వచ్చి వినూత్నంగా ఆలోచించి మెరుగైన ఫలితాలు సాధించాలన్నారు. కొత్తదనంతో పెద్ద పెద్ద ఆలోచనలు చేసి మెరుగైన ఫలితాలు సాధించాలన్నారు. దానికి అవసరమైన నిధులు సమకూర్చడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం సూచించిన విధంగా ఒక జిల్లా ఒక ప్రాడక్ట్‌గా గుర్తింపు ఉండాలన్నారు. మోడరన్ నర్సరీలు ఏర్పాటు చేయవలసిన అవసరం ఉందన్నారు. ఉద్యాన వన శాఖ సంబంధిత శాఖలతో సమన్వయ పరచుకోవాలన్నారు. ప్రతి మండలం ఒక ఉద్యాన పంటల హబ్‌గా ఉండలాన్నారు. కార్యక్రమంలో డిఆర్‌డిఏ ప్రాజెక్ట్ అధికారి నాగరాజ కుమారి, మెప్మా అధికారి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. తొలుత జిల్లా ఉద్యాన శాఖ అధికారి రమణా రెడ్డి.. ఆ శాఖ అమలు చేస్తున్న పనుల పురోగతిపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ చేశారు.

# మండలంలో ఉపాధిహామీపై అన్నపూర్ణ హామీ.. ఏపీఓ సునామి

**● మాకు మస్టర్లు అవసరం లేదు బిల్లులు మేము ఇస్తాం.. కమిషన్ మీరు ఇవ్వండి అన్న తీరిలో మండల ఎన్ఆర్‌జీఎస్ ● టీఏలు చేతివాటం.. ఏపీఓ అభయహస్తం ● మండలంలో ఉపాధిహామీ అవినీతిమయం**



**సైదాపురం, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని నిరుపేదల కోసం ప్రవేశపెట్టినది ఈ పథకంలో అవినీతి ఉండడంతో ఉపాధిలో పని చేయించే ఫీల్డ్ అసిస్టెంట్ నుండి టిఏలు ఏపీవోలు దాకా వారే తిమింగలంగా మారాడం తీవ్ర ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి సైదాపురం మండలంలోని పలు పంచాయతీలలో జరిగిన ఉపాధిహామీ గ్రామసభ సామాజిక తనిఖీల్లో అన్ని అక్రమాలే చోటు చేసుకున్నాయి. మండలంలో 2024 ఏప్రిల్ నుంచి 2025 మార్చి వరకు మండలం మొత్తానికి తొమ్మిది కోట్లు రూపాయలు పైన వివిధ పనులకు ప్రభుత్వం ఖర్చు చేసింది. 17వ విడత ఉపాధి హామీ సామాజిక తనిఖీల్లో భాగంగా ఒక్క, ఎస్ఆర్పీ, నలుగురు, డిఆర్పిలు గత పది రోజుల నుండి ఆయా గ్రామాలలో తనిఖీలు నిర్వహించి గ్రామసభలు నిర్వహిస్తున్నారు. అయితే కేంద్ర ప్రభుత్వం గ్రామలలో కూలి చేసుకుంటూ గతంలో కట్టెలు కొట్టి జీవనం సాగిస్తున్న ఆ నిరుపేదల కోసం ప్రభుత్వాలు వారి బ్రతుకులలో వెలుగు చూడాలని ఉద్దేశంతో ఉపాధి హామీని ప్రవేశపెట్టింది. మండలంలో సామాజిక ఉపాధి తనిఖీలు చేస్తున్నప్పటికీ ఉపాధి చేసిన ఏ కూలీకి కూడా తెలియకుండా గుట్టు సప్పుడుగా ఈ తనిఖిలు నిర్వహిస్తూ ఎవరికి తెలియకుండా గ్రామ సభలు నిర్వహిస్తూ కనీసం గ్రామంలో స్థానికులకు తెలియకుండా గ్రామ సభ పెడుతున్నారు. ఆ గ్రామంలో ప్రజలకు తెలిసేలా దండోరా వేయకుండా పకడ్బందీగా ఈ గ్రామసభలు నిర్వహిస్తూ ఉండడంతో మండలంలోని ప్రజలు ఇది ఎంతవరకు న్యాయమని ఏ విషయమైనా అందరికీ తెలిసేలా గ్రామసభ నిర్వహించాలి. ఆ గ్రామసభలో ముఖ్య సభ్యులుగా పంచాయతీ కార్యదర్శి, గ్రామంలో స్థానిక ప్రజలు కలుసుకొని గ్రామ సభను నిర్వహించడం జరుగుతుంది. కానీ ఈ మండలంలో మాత్రం పనిచేసింది ( ఉదాహరణకు 200 మంది ఉంటే 05 లేక 10 మందితో గ్రామసభ నిర్వహించి గ్రామసభఅయిపోయిందన్న విషయాలు ఓ పది గ్రామసభలు వెలుగులోనికి వస్తున్నాయి.

### గుట్టు చప్పుడు కాకుండా గ్రామ సభలు నిర్వహణ

మండలం పరిధిలో 2024 ఏప్రిల్ 1 నుంచి 2025 మార్చి 31కి సంబందించి 17వ సామాజిక తనిఖీల్లో భాగంగా మండలంలో గత రోజులుగా టామ్ టామ్ (దండోరా) వహించకుండానే గ్రామ సభలో అధికారులు ఎవరూ లేకుండానే ఉపాధి హామీ సిబ్బంది మాత్రమే 7 లేదా 8 మందితో నాలుగు గొ'డల మధ్య రహస్యంగా గ్రామసభలను నిర్వహించి తక్కువ సమయంలోనే ముగించేస్తున్నారు. ఈ విధంగా ఇప్పటివరకు మండలం పరిధిలో 10 పంచాయతీలపైనే గ్రామసభలు నిర్వహించినప్పటికీ మీడియాకి ఎలాంటి సమాచారం ఇవ్వలేదు. ఈ విషయం ఎంపీడీవో ఎం.వి రామ్మోహన్‌రెడ్డి, ఏపీవో సురేంద్ర దృష్టికి తీసుకెళ్లగా ఉపాధి హామీ పథకంకు సంబంధించి మండలంలో గ్రామసభలు గురించి ఎలాంటి సమాచారం తెలియదని చేతులెత్తేశారు. మండలంలో ఉపాధి హామీ పనులకు సంబంధించి చీమ చిట్టుక్కుమన్న ఎంపీడీవో, ఏపీఓకు తెలియకుండా జరగదనేది జగమెరిగిన సత్యం. వీరు మాకు తెలియదు అనడానికి దీని వెనుక ఉన్న ఆంతర్యం ఏమిటి.? లాలూచీ పడ్డారా.? లేక ఇంకేమన్నా కారణం ఉందా.? ఇప్పటివరకు రహస్యంగా పం చాయతీలలో జరిగిన గ్రామ సభలను మళ్లీ నిర్వహిస్తారా.? లేకగాలికి వదిలేస్తారా.? ఏది ఏమైనా కానీ మండలం స్థాయిలో ఐదు సంవత్సరాల క్రితం చనిపోయిన వారికి బతికి వచ్చి పని చేస్తున్నారంటూ ఉపాధి హామీ సిబ్బంది, ఇదే అదునుగా స్థాయిని బట్టి ముడుపులు మింగేశారు. చనిపోయిన వ్యక్తి పని చేసినప్పుడు ఆ చనిపోయిన వ్యక్తిని కూడా కుటుంబ సభ్యులకు అప్పగిస్తే బాగుండు. ఇలా చెప్పుకుంటూ పోతే చాలానే ఉన్నాయి. ఇది వరకు డిఆర్‌పిలు ఇతర జిల్లాల నుంచి మండలానికి వచ్చి నిక్కచ్చిగా ఆడిట్ నిర్వ హించేవారు. కానీ ఇప్పుడు మాత్రం డిఆర్‌పి స్థానికులే కావడం విశేషం. మం డలంలో జరుగుతున్న ఉపాధి హామీ పథకంకు సంబంధించి జిల్లా కలెక్టర్ విచారణ జరిపితే మరిన్ని వెలుగులోకి వస్తాయని ప్రజలు కోరుకుంటున్నారు.

### తూతూ మంత్రంగా తనిఖిలు

మండలంలోని పంచాయతీ పరిధిలో 2024/ 2025 సంవత్సరానికి గాను సైదాపురం మండలానికి 9 కోట్ల పైనే ఉపాధి పనులకు బిల్లులు టిఏలు, ఏపీవో, ఈసీ, పర్యవేక్షణలో మంజూరు చేశారు. అయితే 2024-25లో చేసిన పనులపై సామాజిక తనిఖీలు నలుగురు డిఆర్పిల ద్వారా నిర్వహించారు. రహస్య తనిఖీలలో భాగంగా 10 పంచాయతీలు ఉండిపోగా మిగతా కొని పంచాయతీలలో డిఆర్పీలు గ్రామ సభలలో విస్తృత పోయే నిజాలు బయట పెట్టడం జరిగింది అవి పనిచేయకనే ఎటువంటి మాస్టర్లు వేయకనే బిల్లులు పెట్టడం జరిగిందని, మరి కొన్ని సమయాలలో మాస్టర్లు తనిఖీ చేయగా సంతకాలన్నీ ఒకేలా ఉండడం పై ఒకరే ఈ సంతకాలన్నీ పెట్టారని కొన్ని మాస్టర్లను డిఆర్పీలు నిర్ధారించడం జరిగింది. విడ్డూరం ఏమిటంటే ఉపాధి పనులు చేసిన వారు ఒకరైతే గ్రామ సభలకు మాత్రం వేరే కొన్ని పెట్టి గ్రామసభలు పూర్తి చేయడం. ఇది దేనికి సంకేతం అని ప్రజలలో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇదంతా ఓ ఎత్తుగా ఉంటే మిడ్ డే మీల్స్ వర్కర్స్‌కు హాజరులు ఉండడం, వారికి డబ్బులు చెల్లించడం,అదేవిధంగా అంగన్వాడి కార్యకర్తకు హాజరు వేసి వాళ్లకి బిల్లులు చెల్లించడం, ఇదంతా ఒక వెతైతే చనిపోయిన వారికి కూడా మస్టర్లు హాజరు వేసి బిల్లులు మంజూరు చేయడం గమనార్హం. ఇది ఎంతవరకు న్యాయమని పనులకు పోనటువంటి వారికి కూడా బిల్లులు మంజూరు చేసి దోచుకునే ప్రక్రియ బాగానే కొనసాగుతుందని మండల ప్రజల విమర్శలకు తావునిస్తుంది. కొన్ని పంచాయతీలలో ఒక విధంగా ఉంటే మరికొన్ని పంచాయతీలలో మాత్రం. ఫీల్డ్ అసిస్టెంట్లు మాస్టర్ లలో కూలీల సంతకాలు చేయించకుండా ఉంటే టి ఏ లు వాటిపై సంతకాలు చేసుకొని ఏపీవో సంతకాలు లేకుండానే బిల్లులు చేయడం జరిగిందని డిఆర్పీలు తెలిపారు. అయితే ఈ గ్రామ సభల్లో గ్రామ సభలకు హాజరవ్వడం గమనార్హం. ఉదాహరణకు ఒక గ్రామంలో 300 జాబ్ కార్డులు ఉంటే అందులో 200 మంది పనిచేశారని చూపించడం డిఆర్‌పిల తనిఖీల్లో అందులో సగం మందిని కలిసి మాట్లాడటం గ్రామ సభకు మాత్రం ఐదు పది మందిని హాజరు పరచడం ఈ తంతులో గ్రామసభలు జరుగుతున్నాయి. అయితే ప్రతి గ్రామంలో ఉపాధి పనులకు గాను ఫీల్డ్ అసిస్టెంట్లు నుండి టిఏలు, ఏపీఏ ఎంత శ్రద్ధగా పనిచేశారు.. ఎంత నిజాయితీతో నిబద్ధతతో ఉన్నారో ఎంత అవినీతి జరుగుతుంటే అధికారులు నిద్రపోతున్నారా అంటూ మండల ప్రజలు విమర్శించుకుంటున్నారు.

# 4.60 లక్షల నర్సరీ మొక్కల పెంపకం లక్ష్యం

- **దశల వారిగా బెడ్స్ సిద్ధం చేసే పనులు పూర్తి**
- **అధికారుల పనితీరు అభినందనీయం**
- **సోషల్ ఫారెస్ట్ జిల్లా అధికారి నాగార్జున రెడ్డి**



**నెల్లూరు/వేదాయపాలెం, మేజర్‌న్యూస్ :** సామాజిక వన విభాగం (సోషల్ ఫారెస్ట్)నెల్లూరు డివిజన్ ద్వారా 2026-27 ఆర్థిక సంవత్సరానికి గాను 4.60 లక్షల నర్సరీ మొక్కలు పెంచి పంపిణీకి సిద్ధం చేయడమే లక్ష్యంగా ఎంచుకున్నట్లు సోషల్ ఫారెస్ట్ జిల్లా అధికారి వి.నాగార్జున రెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక పొదలకూరు రోడ్డు వాటర్ ట్యాంక్ ప్రాంతంలో ఉన్న సోషల్ ఫారెస్ట్ డివిజనల్ కార్యాలయం నందు రేంజ్ ఆఫీసర్లతో నిర్వహించిన డీఎఫ్ఓ నాగార్జున రెడ్డి, నెల్లూరు, కావలి, ఆత్మకూరు రేంజ్‌ల పరిధిలో ఉన్న 8 నర్సరీల అభివృద్ధి, మొక్కల పెంపకం స్థితిగతులపై క్షేత్రస్థాయి అధికారులతో పాటు డిప్యూటీ రేంజ్ ఆఫీసర్లతో సుదీర్ఘంగా చర్చించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం మంజూరు చేసిన కాంపా, ఆగ్రో ఫారెస్ట్ స్కీమ్స్ కింద సోషల్ ఫారెస్ట్ డివిజన్ ఆధీనంలోని నెల్లూరు, కావలి, ఆత్మకూరు రేంజ్‌ల పరిధిలో ఉన్న 8 నర్సరీల్లో మొక్కల పెంపకానికి సంబంధించి బెడ్స్ ఏర్పాటు చేసే ప్రక్రియ తుది దశలో ఉందన్నారు. అందులో భాగంగానే కాంపా స్కీం కింద 2.25 లక్షల మొక్కల పెంపకానికి సంబంధించిన బెడ్స్ ఫిల్లింగ్ పనులు పూర్తయ్యాయని, ఆగ్రో ఫారెస్ట్ స్కిం కింద మరో 2.35 లక్షల మొక్కల పెంపకానికి అవసరమైన బెడ్స్ ఫిల్లింగ్ పనులు తుడిదశలో ఉన్నాయని మరో 15 రోజూల్లో పూర్తి కానున్నట్లు ఆయన తెలిపారు. అదేవిధంగా ఎంజిఎన్ఆర్ఈజిఎస్ పథకం కింద పెంచిన 5లక్షల నర్సరీ మొక్కలు పంపిణికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. మిగిలిన జిల్లాలతో పోల్చుకుంటే నెల్లూరుజిల్లా సామాజిక వనవిభాగంలో నిబద్దతతో పనిచేసే అధికారులు, ఉండటం, శాఖపరమైన అవగాహనతోపాటు బాధ్యతాయుతమైన పనితీరుతో ప్రభుత్వ లక్ష్యాలను పూర్తి చేయాలన్న తపన ఎక్కువగా ఉండటం, ప్రభుత్వ మార్గదర్శకాలు శిరోధార్యంగా భావిస్తూ ముందుకెళుతుండటం అభినందనీయమన్నారు. ప్రభుత్వ ప్రోత్సాహం, ఉన్నతాధికారుల దిశ నిర్దేశిత, మార్గదర్శక సూచనలు సలహాలు, క్షేత్ర స్థాయి అధికారుల స్పెషల్ మానిటరింగ్ చర్యలు, ప్రజల భాగస్వామ్యాలతో సోషల్ ఫారెస్ట్ ప్రస్థానాన్ని అభివృద్ధి పథంలో మరింత ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తామన్నారు. సమావేశంలో నెల్లూరు కావలి ఆత్మకూరు ఇంచార్జ్ రేంజ్ ఆఫీసర్లు ఇంద్రసేనారెడ్డి, హిమబిందు, ప్రత్యూష, ఉలవపాడు సెక్షన్ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ రమేష్, పొదలకూరు సెక్షన్ ఆఫీసర్ శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ నులిపురుగులు నిర్మూలన కార్యక్రమం

**మర్రిపాడు, మేజర్‌న్యూస్ :** మండల పరిధిలోని కృష్ణాపురం గ్రామంలోని ప్రధానమంత్రి జవహర్ నవోదయ విద్యాలయం నందు మర్రిపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర+ వైద్యాధికారి గోపినాథ్ ఆధ్వర్యంలో జాతీయ నులిపురుగులు నిర్మూలన కార్యక్రమములో భాగంగా విద్యాలయం నందలి విద్యార్థులకు అల్బెండజోల్ 400మి.గ్రా మాత్రలు మంగళవారం మింగించారు. ఈ కార్యక్రమంలో భాగంగా మండలంలోని అన్ని అంగన్వాడి కేంద్రములలో, ప్రాథమిక పాఠశాలలు, ప్రాథమికొన్నత పాఠశాలు, ఉన్నత పాఠశాలలు యందు విద్యార్థులందరికీ మింగించడం జరిగింది. ఈ సందర్భంగా వైద్యాధికారి గోపీనాథ్ మాట్లాడుతూ.. సంవత్సరములో రెండు సార్లు క్రమము తప్పకుండా ప్రభుత్వం అందించే అల్బెండజోల్ 400మి.గ్రా మాత్రలు మింగడం ద్వారా రక్త హీనతకు గురి కాకుండా ఆరోగ్యంగా ఉంటూ చదువులలో, ఆటలలో రాణించడం జరుగుతుందని విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కృష్ణాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి మష్కూర్ అహ్మద్, మర్రిపాడు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి అమరసింహారెడ్డి ఆరోగ్య విస్తరణ అధికారి షేక్ జావీద్, ఆరోగ్య పర్యవేక్షులు జగన్మోహన్, స్థానిక సిబ్బంది పాల్గొన్నారు.

## జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం



**అనుమసముద్రంపేట, మేజర్‌న్యూస్ :** ఏఎస్ పేట మండలం చిరమన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. చిరమణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గల 1-19 సంవత్సరాలు గల పిల్లలు 1522 మంది ఉన్నారు, వారిలో మంగళవారం 1431 మంది పిల్లలకు ఆల్బెండైజల్ మాత్రలను నమిలి మింగించడం జరిగిందని తెలిపారు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని అన్ని పాఠశాలల్లో ,అంగన్వాడీ కేంద్రాలలో, ఐటిఐ కాలేజీలోని విద్యార్థులకు మాత్రలు నమిలి మింగించారు. అలాగే ఈరోజు మింగని వారిని ఎంఓపియుపి డే అనగా ఈనెల 24వ తేదీన మాత్రలు మింగించడం జరుగుతుందని తెలిపారు ఈ కార్యక్రమాన్ని జిల్లా ఇమ్యూనైజషన్ అధికారిణి డాక్టర్ ఉమామహేశ్వరి పరిశీలించినారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు బి.జ్యోతి రాణి, కంచర్ల నాగ వినూత, సూపర్వైజర్లు షేక్ షఫీ ఎంఎల్‌హెచ్‌పిలు ఏఎన్ఎంలు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు అంగన్వాడీ టీచర్లు ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే మండల కేంద్రమైన ఏఎస్ పేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని అన్ని పాఠశాలల్లో అంగన్వాడి కేంద్రాలలో విద్యార్థులకు ఆల్బెండైజల్ మాత్రలను మింగించడం జరిగిందని డాక్టర్ నరసింహస్వామి తెలిపారు.

## ఉద్యోగులకు మెమోలు జారీ చేసిన కమిషనర్

**బుచ్చిరెడ్డిపాలెం, మేజర్‌న్యూస్ :** మున్సిపాలిటీ పరిధిలోని సచివాలయాలలో పనిచేస్తున్న ఏఎన్ఎంలు, సెక్రెటరీలు పదిమందికి మంగళవారం మెమోలు జారీ చేసినట్లు మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణ తెలిపారు. తమ పరిధిలో నిర్వహించాల్సిన యూనిఫైడ్, అక్షరాంధ్ర, మనమిత్ర లాంటి తదితర సర్వేలను సక్రమంగా నిర్వహించకుండా విధులలో అలసత్వం వహిస్తుండడంతో మెమోలు జారీ చేసినట్లు ఆయన తెలిపారు.

# రథోత్సవంలో విద్యుత్ ఉద్యోగుల కృషి అభినందనీయం

**నెల్లూరు/వేదాయపాలెం, మేజర్‌న్యూస్ :** నెల్లూరు మూలపేట శివాలయం రథోత్సవం సందర్భంగా మంగళవారం అనుక్షణ పర్యవేక్షణతో విద్యుత్ ఎలాంటి అంతరాయాలు ఏర్పడకుండా అధికారులు.. సిబ్బంది పరస్పర సమన్వయంతో తీసుకున్న జాగ్రత్తలు.. చేసినకృషి ఫలితంగా స్థానిక భక్తులతోపాటు ప్రజల నుంచి ప్రశంసలు వెలువెత్తాయి. రథోత్సవం సందర్భంగా ముందస్తు ఏర్పాట్లు, అవాంతరాలు లేని విద్యుత్ నిర్వహణ ప్రత్యేకతను సంతరించుకుంది. యూనిటీ ఆఫ్ వర్క్‌కు నిదర్శనం, డైకస్ రోడ్ సిబ్బంది అంటూ పలువురు విద్యుత్ ఉన్నతాధికారులు, స్థానిక ప్రజలు, భక్తులు అభినందించడం విశేషం. ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన మూలపేట శివాలయం రథోత్సవం సందర్భంగా విద్యుత్ శాఖ సిబ్బంది చూపిన ఉత్తమ పనితీరుకు స్థానిక మూలపేట ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ, డైకస్ రోడ్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ లక్ష్మి భాయ్తోపాటు సిబ్బందికి అభినందనలు తెలిపారు. రథం ప్రయాణించే సమయంలో ఎలాంటి అవాంతరాలు తలెత్తకుండా ముందస్తుగా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేపట్టడం జరిగింది. రథం వెళ్లే మార్గంలో బ్యారెల్ వైర్లు అడ్డురాకుండా ముందుగానే తొలగించి, రథం వెళ్లిన వెంటనే బ్యారెల్‌ను పునరుద్ధరించి విద్యుత్ సరఫరాను నిర్దేశించిన సమయానికి ముందే పునరుద్ధరించడం జరిగింది. సమగ్ర కార్యాచరణ



డైకస్ రోడ్ సిబ్బంది సమిష్టి కృషితో విజయవంతమైందని స్థానిక ప్రజలు, జిల్లా నలుమూలల నుంచి విచ్చేసిన భక్తులు తెలిపారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ లక్ష్మి భాయ్ మాట్లాడుతూ.. 'డైకస్ రోడ్ సిబ్బంది అందరూ యూనిటీగా పనిచేయడం వల్లే ఈ కార్యం విజయవంతం చేసేందుకు సాధ్యమైందని. మా సెక్షన్ యూనిటీ ఆఫ్ వర్క్‌కు నిదర్శనం' అని అన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన డైకస్ రోడ్ అసిస్టెంట్ ఇంజనీర్, సిబ్బందిని డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు టి.కిరణ్ కుమార్, ఈఈ మన్నేపల్లి శ్రీధర్‌లు ప్రత్యేకంగా ప్రశంసించారు.

# కోటి 29 లక్షలతో కరెంటు అభివృద్ధి పనులు

## టీడీపీ నాయకులు గిరిధర్ రెడ్డి



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని 25వ డివిజన్, బుజబుజ నెల్లూరులో 1 కోటి 29 లక్షల రూపాయల వ్యయంతో కరెంటు అభివృద్ధి పనులను మంగళవారం 25వ డివిజన్ కార్పొరేటర్ బద్దెపూడి నరసింహ గిరితో కలిసి టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి ప్రారంభించారు. ప్రజా బాటలో భాగంగా బుజబుజ నెల్లూరు ప్రాంతానికి వచ్చినప్పుడు, స్థానిక ప్రజలు లో-వోల్టేజ్ సమస్యను రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి దృష్టికి తీసుకురాగా, వెంటనే అధికారులతో మాట్లాడి బుజబుజ నెల్లూరు నందు లో-వోల్టేజ్ సమస్య పరిష్కారం దిశగా 1 కోటీ 29 లక్షల రూపాయలతో 13 నూతన ట్రాన్స్ ఫార్మర్లను ఏర్పాటు చేయడం జరిగిందని టిడిపి నాయకులు గిరిధర్‌రెడ్డి తెలిపారు. దాదాపుగా 5 కిలోమీటర్లు సింగల్ ఫేసు త్రీ వైర్, త్రీ ఫేజ్ 5 వైర్ లైన్స్ కన్వర్షన్, ఫీడర్ బైఫరికేషన్, కొత్త విసిబి ఏర్పాటుచేయుట, పాత కండక్టర్లు తీసి కొత్త కండక్టర్లు ఏర్పాటు చేయడం జరిగిందని టిడిపి నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి జెన్ని రమణయ్య, టీడీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి మాతంగి కృష్ణ, కో క్లస్టర్ ఇంచార్జ్ కంటే సాయిబాబా, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయ ఇంచార్జ్ దాట్ల చక్రవర్తన్ రెడ్డి, టీడీపీ నాయకులు బ్రహ్మారెడ్డి, నగళ్ల రాము, హరి నాయుడు, పులి నాగేశ్వర రావు, పిగిలం సుబ్బన్న, దొడక రమేష్, గుంటగాని అశోక్, సురబత్తిన రవీంద్ర, బాలకృష్ణ యాదవ్, మాతంగి నరసింహులు, అబ్దుల్లా, కరిముల్లా, ఖాదిర్, అంజాద్, సత్తార్, జయరామ రాజు, ఎద్దల ప్రసాద్, రమేష్, రాజా, చిన్న ఆంజనేయులు, కృష్ణ, సాయి, శ్రీనివాస రాజు, సిద్దయ్య, తిరుపాల్, మాబాషా, సంధాని, షబ్బీర్, నవీద్, ముజీర్, రఫీ హుస్సేన్, గుంటి కృష్ణయ్య, చలమయ్య, జమునమ్మ, ఇంద్రసేనమ్మ, నాగూర్ బీ, పర్వీన్, సునైనా, నాయుడమ్మ, జనసేన నాయకులు కుడుముల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# కేవలం 42 రోజులు మాత్రమే ఉన్నాయి

## ● ఆస్తి పన్ను వసూళ్లపై దృష్టి పెట్టండి : కమిషనర్



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నగరపాలక సంస్థ కమిషనర్ వైఓ నందన్ వారాంతపు సమీక్ష సమావేశం మంగళవారం రెవిన్యూ సిబ్బందితో కమాండ్ కంట్రోల్ సెంటర్ నందు నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ఈ ఆర్థిక సంవత్సరానికి కేవలం 42 రోజులు మాత్రమే మిగిలి ఉన్నాయని కావున రెవెన్యూ సిబ్బంది అందరూ గత సంవత్సరం ఆస్తి పన్నులు చెల్లించిన వారు ఈ సంవత్సరం చెల్లించని వారి వద్ద వసూలు జరిగేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. తద్వారా సుమారుగా 20 కోట్లు ఆస్తి పన్ను వసూళ్లు అవుతుందని ఈ సందర్భంగా సిబ్బందికి తెలియజేశారు. నగరపాలక సంస్థ పరిధిలోని మొండి బకాయి దారులు జాబితా లోని బకాయి దారులను నేరుగా కలిసి వారు చెల్లిస్తానన్న గడువు సమయమున తిరిగి మరల వారి వద్దకు వెళ్లి పన్నులు వసూలు జరిగేలా చర్యలు చేపట్టాలని సూచించారు. సచివాలయ పరిధిలోని కొత్తగా నిర్మించిన భవనములు, అదనపు అంతస్తులు, నిర్మించిన భవనములు, కమర్షియల్ భవనములు గుర్తించి వాటిని ట్యాక్స్ పరిధిలోకి తీసుకొని రావలసిందిగా ఆదేశించారు. వీటితో పాటు ఇంకా విధించవలసిన ఖాళీ స్థలములు పన్నులు వెంటనే గుర్తించి టాక్స్ పరిధిలోకి తీసుకురావాలని ఆదేశించారు. సిబ్బంది అందరూ స్పెషల్ డ్రైవ్ చేపట్టి ఆస్తి పన్ను, కొళాయి పన్ను, డ్రైనేజీ పన్నుల వసూళ్లకు చర్యలు చేపట్టవలసిందిగా ఈ సందర్భంగా సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, టిపిఆర్ఓ వాసు బాబు, రెవిన్యూ ఆఫీసర్లు సమద్, శ్రీనివాసులు, రెవిన్యూ ఇన్స్పెక్టర్లు, సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

# భువనేశ్వరి దేవస్థానంలో వైభవంగా రథోత్సవం



**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** శివ రాత్రి మహోత్సవాల ఆఖరి రోజున మూలపేటలో భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వర స్వామి వారి రథోత్సవం భక్తుల హర్షధ్వానాల మధ్య అత్యంత వైభవంగా జరిగింది. వేలాది మంది భక్తులు పాల్గొని స్వామివారి దర్శనం చేసుకుని ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ సీనియర్ నాయకులు, మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యులు నూనె మల్లికార్జున యాదవ్ భక్తులకు మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేసి స్వయంగా మజ్జిగ పంచిపెట్టారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. 'భక్తులకు సేవ చేయడం నా అదృష్టం. స్వామివారి అనుగ్రహంతో ప్రజలకు సేవ చేసే అవకాశాన్ని పొందడం ఆనందంగా ఉంది' అని తెలిపారు. దేశంలోనే అతి పురాతన శైవక్షేత్రాలలో ఒకటిగా ఖ్యాతిగాంచిన ఈ దేవస్థానం సుమారు 11వ శతాబ్దంలో వెలిసిన పవిత్రక్షేత్రం. నిత్యకళ్యాణాలు, పచ్చతోరణాలు, భక్తుల రద్దీతో ప్రతి సంవత్సరం బ్రహ్మోత్సవాలు కన్నుల పండుగగా జరుగుతున్నాయి. ఈ వేడుకల్లో జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొన్నారు. పార్టీ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గారి స్ఫూర్తితో సనాతన ధర్మ పరిరక్షణ, దేవాలయ సంస్కృతి అభివృద్ధి దిశగా కట్టుబడి పనిచేస్తున్నామని నాయకులు పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో ఈ సంవత్సరం బ్రహ్మోత్సవాలకు ప్రత్యేక ఏర్పాట్లు చేయడం జరిగింది. భక్తులకు తాగునీరు, వైద్యసేవలు, భద్రతా ఏర్పాట్లు సమృద్ధిగా కల్పించబడి, ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోబడినాయి. దేవాలయ అభివృద్ధి, భక్తుల సౌకర్యాల విషయంలో ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించడం అభినందనీయం. భక్తి, సేవ, సంస్కృతి అనే మూడు విలువలను ముందుకు తీసుకెళ్తూ జనసేన పార్టీ ప్రజలతో కలిసి ధార్మిక పరిరక్షణలో భాగస్వామ్యం అవుతుందని నూనె మల్లికార్జున యాదవ్ స్పష్టం చేశారు.

# కోడూరులో నులిపురుగుల నివారణ దినోత్సవం



**తోటపల్లి గూడూరు, మేజర్‌న్యూస్ :** మండలంలోని కోడూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం పురస్కరించుకొని జిల్లా అదనపు వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఖాదర్ వలీ (ఎయిడ్స్ లెప్రసీ అండ్ టీబి) ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఖాదర్ వలీ మాట్లాడుతూ.. నులిపురుగులు వలన కలుగు రక్తహీనత, చదువు పట్ల ఏకాగ్రత లేకపోవడం, తదితర నష్టాల పట్ల అవగాహన కల్పించారు. చేతుల పరిశుభ్రత వలన కలుగు ఉపయోగాలు గురించి వివరించారు. ఆల్బెండజోల్ మాత్రలను మ్రింగించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్తేరమ్మ, కోడూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య అధికారిని డాక్టర్ హేన, ఉప ఆరోగ్య విద్యాధికారి ఉమర్, పర్యవేక్షకులు సతీష్,ఆరోగ్య కార్యకర్తలు మస్తానమ్మ, బెంజిమన్, ఆశా కార్యకర్త కామాక్షమ్మ తదితరులు పాల్గొన్నారు. కోడూరు వన్ సచివాలయము పరిధిలోని ఎంజీ కాలనీలోని అంగన్వాడి సెంటర్ నందు పిల్లలకు కూడా ఆల్బెండజోల్ మాత్రలను డాక్టర్ ఖాదర్‌వలీ మింగించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ హేనా, సిహెచ్ఓ రమేష్, ఉప ఆరోగ్య విద్యాధికారి ఉమర్, అంగన్వాడి సూపర్వైజర్ రంగమ్మ ఆరోగ్య కార్యకర్తలు సుజాతరాజు, అంగన్వాడీ కార్యకర్త చెంచమ్మ తదితరులు పాల్గొన్నారు.

# మాదకద్రవ్యాలకు నో చెప్పండి



**అనుమసముద్రంపేట మేజర్‌న్యూస్ :** మండల కేంద్రమైన ఏఎస్ పేటలో ఉన్న జెడ్పీ హైస్కూల్, విద్యార్థులు ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన కల్పించేందుకు సే నో టు డ్రగ్స్,అనే నినాదంతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి. రుక్మిణి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, సమిష్టిగా పాల్గొని డ్రగ్స్‌కు దూరంగా ఉండండి, ఆరోగ్యవంతమైన భవిష్యత్తు, నాశనానికి మాదకద్రవ్యాలు మార్గం, వంటి నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. నగర్ ఖానా వద్ద మానవహారంగా ఏర్పడి విద్యార్థుల చేత మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ.. మాదకద్రవ్యాల వినియోగం విద్యార్థుల ఆరోగ్యానికి, చదువుకు, భవిష్యత్తుకు తీవ్ర హానికరమని తెలిపారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి క్రీడలు, యోగా, వ్యాయామాల ద్వారా ఆరోగ్యకర జీవన విధానాన్ని అలవర్చుకోవాలని సూచించారు. ఈ ర్యాలీలో పాఠశాల ఉపాధ్యాయులు, శారీరక విద్య ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

# జిల్లా స్థాయి చీఫ్ లీగ్ చెస్ పోటీలు ప్రారంభం



**నెల్లూరు/బారకాసు, మేజర్‌న్యూస్ :** జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో సాప్ లీగ్ చెస్ క్రీడా పోటీలు ఈరోజు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ప్రారంభించారు. కార్యక్రమంలో పాండురంగారావు, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ డి.రమణయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో జిల్లా వ్యాప్తంగా మొత్తం 191 మంది క్రీడాకారులు (144 బాలురు, 47 బాలికలు) పాల్గొంటున్నారు. అండర్-13, అండర్-15, అండర్-17, అండర్-19 విభాగాల్లో పోటీలు నిర్వహించబడుతున్నాయి. ప్రారంభ కార్యక్రమంలో అధికారులు మాట్లాడుతూ.. చెస్ క్రీడ మేధస్సును పెంపొందించడంలో ముఖ్యపాత్ర పోషిస్తుందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొనడం ఆనందదాయకమన్నారు. జిల్లాలో చెస్ క్రీడాభివృద్ధికి అవసరమైన సదుపాయాలు కల్పిస్తున్నామని చెప్పారు. ఈ జిల్లా స్థాయి పోటీలలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు ఈనెల 21, 22 తేదీల్లో తిరుపతిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయబడతారు. విజేతలకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేయబడతాయి. ఈ కార్యక్రమానికి క్రీడాభిమానులు, తల్లిదండ్రులు, విద్యార్థులు హాజరై పోటీలను ఆసక్తిగా వీక్షించారు.

# విద్యార్థులకు నులి పురుగుల మందులు పంపిణీ

**బుచ్చిరెడ్డిపాలెం, మేజర్‌న్యూస్ :** జాతీయ నులిపురుగుల నిర్మూలనా దినోత్సవాన్ని పురస్కరించుకొని మునిసిపాలిటీ పరిధిలోని కట్టుబడిపాలెం ప్రాథమిక పాఠశాలలో ఏఎన్ఎం సుభాషిణితో కలిసి వైద్యులు డాక్టర్ మనోజ్ విద్యార్థులకు నులి పురుగుల వలన కలుగు వ్యాధులను గూర్చి అవగాహన కల్పించి, మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మనోజ్ మాట్లాడుతూ నులిపురుగుల వలన రక్తహీనత, విద్యపై ఏకాగ్రత కోల్పోవడం జరుగుతుందన్నారు. తల్లిదండ్రులు విద్యార్థులు బయట తినే చిరు తిండ్లపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు.

# కరెంటోళ్ళ జనబాట విజయవంతం

- బీవీ నగర్ సెక్షన్ లోని పడారుపల్లిలో పర్యటించిన ఎఈ రాఘవేంద్రం
- ప్రజలను నేరుగా కలుసుకొని సమస్యలు తెలుసుకున్న వైనం
- తక్షణ చర్యలతో పరిష్కారం చూపుతామని హామీ



**నెల్లూరు/వేదాయపాలెం, మేజర్‌న్యూస్ :** ఏపీ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్‌లో తేటి శివశంకర్ ఆదేశాల మేరకు నెల్లూరు జిల్లా వ్యాప్తంగా విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన 'కరెంటోళ్ళ జనబాట' కార్యక్రమం అనుదినంగా విజయవంతమైంది. కరెంటోళ్ల జనబాట కార్యక్రమంలో భాగంగా జిల్లా సూపరింటెండింగ్ ఇంజనీరు కె.రాఘవేంద్రం నెల్లూరు టౌన్ డివిజన్ పరిధిలోని బివి నగర్ సెక్షన్‌లోని పడారుపల్లి ప్రాంతాన్ని సందర్శించి, అక్కడి విద్యుత్ వినియోగదారులతో ప్రత్యక్షంగా సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా సూపరింటెండింగ్ ఇంజనీరు రాఘవేంద్రం మాట్లాడుతూ.. వినియోగదారుల సమస్యలను క్షేత్రస్థాయిలోనే గుర్తించి తక్షణ పరిష్కారం అందించాలనే లక్ష్యంతో, విద్యుత్ శాఖ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ లోతేటి శివశంకర్ ఆదేశాల మేరకు 'కరెంటోళ్ళ జనబాట' కార్యక్రమాన్ని రూపొందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమం ప్రతి మంగళ, శుక్రవారాలు క్రమం తప్పకుండా నిర్వహించబడుతుందని వివరించారు. జిల్లా అంతటా అధికారులు, సిబ్బంది ఉదయం 7.30 గంటలకే ఫీల్డ్‌కు చేరుకుని కార్యక్రమాన్ని ప్రారంభించి, లూజ్ లైన్లు, డామేజ్ అయిన విద్యుత్ పోల్స్, తక్కువ ఎత్తులో ఉన్న ట్రాన్స్ఫార్మర్లు, చెట్ల కొమ్మలు విద్యుత్ లైన్లను తాకడం, కండక్టర్ డామేజ్ వంటి సమస్యలను గుర్తించి, ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తూ తక్షణ పరిష్కార చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రధానంగా తక్కువ ఎత్తులో ఉన్న కొన్ని ట్రాన్స్ఫార్మర్లను గుర్తించి, వెంటనే వాటికి ఎస్టిమేషన్ సిద్ధం చేసి పంపించాలని, సంబంధిత పనులు తక్షణమే చేపట్టాలని ఆదేశించారు. అలాగే ఫేస్డ్ మ్యానర్‌లో ఫైవ్ వైర్ వ్యవస్థకు సంబంధించి కూడా ఎస్టిమేషన్ సిద్ధం చేయాలని సూచించారు. అదేవిధంగా ఫీల్డ్ పర్యటనలో వినియోగదారుల నుంచి వచ్చిన స్పందనపై వివరాలను సేకరిస్తున్నామని, ఈ యాప్ మరింత సమర్థవంతంగా పనిచేయడానికి క్షేత్రస్థాయిలో అధికారులు, సిబ్బంది గమనించిన లోపాలను కార్పొరేట్ కార్యాలయం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు టౌన్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు శ్రీధర్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు అశోక్, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాంప్రసాద్ రెడ్డి, సిబ్బంది తదితర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# గిరిజన హక్కులు కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** రాష్ట్రంలోని గిరిజన హక్కులను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని గిరిజన నేత తలపల జయ వర్ధన్ పేర్కొన్నారు. నెల్లూరు నగరపాలక సంస్థ మేయర్ ఎన్నికపై రాష్ట్ర ఎన్నికల కమిషన్ నీలం సాహ్ని స్పందించడం పట్ల, ఆమెకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ఆయన విలేకరులతో మాట్లాడారు. మాజీ మేయర్ పొట్లూరి స్రవంతి విషయంలో ప్రభుత్వం తప్పు చేసిందని, దీనిని సవరించుకునే బాధ్యత కూడా ప్రభుత్వంపై ఉందన్నారు రాజ్యాంగబద్ధంగా గిరిజనులకు కేటాయించిన స్థానంలో మరో ఇతర కులస్తులకు అవకాశం కల్పించడం బాధాకరమన్నారు. ఇలాంటి పొరపాట్లు వల్ల గిరిజనులు తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించడం సంతోషదాయకమన్నారు. తమ ఉద్యమం వెనక ఎవరో ఉన్నారని.. ప్యాకేజీలు ఇస్తున్నారని విమర్శలు చేయడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో బాపట్ల వెంకటపతి యానాది, భక్తుల లక్ష్మణ శేఖర్, చౌటురి శ్రీనివాసులు, ఏడుకొండలు కందల రమేష్, ఏకశిర మురళి సురేంద్ర, ఏకుల సుధీర్, చేవూరు శ్రీనివాసులు, శ్రావణ్ కుమార్, గిరిజన నాయకులు పాల్గొన్నారు.

# పేదల ఆశాకిరణం వీపీఆర్ నేత్ర




**వింజమూరు, మేజర్‌న్యూస్ :** గ్రామీణ ప్రాంతంలో వైద్య సేవల దూరంగా ఉన్న ప్రజలకు విపిఆర్ నేత్రం ఆశా కిరణంగా నిలుస్తుందని, తెలుగుదేశం పార్టీ మండల కన్వీనర్ గూడా నర్సారెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని ఊటుకూరు పంచాయతీలో జరిగిన విపిఆర్ నేత్ర శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా స్థానిక తెలుగుదేశం పార్టీ నేతలు తెలుగు యువత అధ్యక్షులు మాదినేని. నరేంద్ర, నీటి సంఘం అధ్యక్షులు గోరంట్ల నాగభూషణంతో చర్చించి విపిఆర్ నేత్ర సేవలను ప్రతి ఒక్కరు పొందే విధంగా కృషి చేయాలనికోరారు. ఇందిరానగర్, తక్కెళ్ళపాడు, గ్రామాలకు వెళ్లి విపిఆర్ నేత్ర సేవలను సద్వినియోగపరచుకోవాలని ప్రజలను సూచించారు. విపిఆర్ నేత్ర క్యాంపు వద్దనున్న ప్రజల ఉద్దేశించి నేతలు మాట్లాడుతూ నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి దంపతులు జిల్లాలోనే వెనుకబడిన ఉదయగిరి నియోజకవర్గంలో విపిఆర్ నేత్ర మొబైల్ వాహనం ద్వారా అనుభవజ్ఞులైన కంటి వైద్యుల బృందం పంపించి కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి అక్కడికక్కడే కంటి అద్దాలను అందించడం ఎంతో శుభ పరిణామం అన్నారు. వేమిరెడ్డి దంపతులు విపిఆర్ ఫౌండేషన్ పేరుతో ట్రై సైకిల్లు పంపిణీ వి పి ఆర్ అమృతధార ఇలా ప్రజలకు అందిస్తున్న సేవలు అభినందనీయమని కొనియాడారు. బుధవారం నిర్వహించిన కంటి వైద్య శిబిరానికి ఊటుకూరు తక్కెళ్ళపాడు ఇందిరానగర్ గ్రామాల నుండి 340 మంది శిబిరానికి హాజరు కాగా 180 మందికి కంటి అద్దాలను అవసరమని గుర్తించి వారికి కంటి అద్దాలను ఉచితంగా అందజేశారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతం ప్రజలకు కార్పొరేట్ వైద్య సేవలు అందించాలని తలచి ఇలాంటి శిబిరమును నిర్వహించడంతో కంటి సమస్యలతో ఇబ్బందులు పడుతున్న వారికి ప్రయోజనకరమన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రోడ్డ వెంగమ్మ, మండల ఉపాధ్యక్షులు ఆనంగి రమణయ్య, అంచూరి శ్రీనివాసులు, వరికూటి మల్లికార్జున, మాజీ ఎంపిటిసి రోడ్డ కొండయ్య, తిరుపతాచారి అంకి పెద్దయ్య తదితరులు పాల్గొన్నారు.



# పొగాకు రైతులను ఆదుకోండి : కంచర్ల

**కావలి, మేజర్‌న్యూస్ :** రాష్ట్రములో రైతులు సంవత్సరం పొడుగునా ఎండనక వాన కనక కష్టపడి పండించిన పొగాకుకు రైతుకు కష్టానికి తగిన ఫలితం అందేలా చూడాలని బిజెపి సీనియర్ నాయకులు కంచర్ల మురళీకృష్ణ నాయుడు మంగళవారం ఆల్ ఇండియా ప్రబోకో బోర్డు చైర్మన్ చిగురుపాటి యశ్వంత్ కుమార్‌ను కోరారు. మంగళవారం గుంటూరులోనే టొబాకో బోర్డు కార్యాలయంలో రైతులను కలిసి ఈ మేరకు విజ్ఞప్తి చేశారు. అనంతరం కంచర్ల మాట్లాడుతూ.. త్వరలో ప్రారంభం కానున్న పొగాకు కొనుగోలు ప్రతి రైతు తన కష్టాన్ని తగిన ఫలితం పొందేలా చూడాలని రైతులు పడుతున్న కష్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపించి దేశానికి వెన్నుముక రైతేనని చెప్పిన విధంగా రైతులకు కావలసిన అన్ని సదుపాయాలు, సబ్సిడీలు అందించేందుకు కృషి చేయాలని తెలిపారు. రైతును ప్రోత్సహిస్తే తను పండించిన పంట ఈరోజు మన రాష్ట్రం కానీ దేశం కానీ రైతు లేకపోతే ఆ దేశమే శూన్యం. కాబట్టి రైతులకు తమ కష్టానికి తగిన ప్రతిఫలాన్ని అందించే విధంగా అధికారులు చొరవ తీసుకొని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేయాలని, ఈ సందర్భంగా కంచర్ల మురళీకృష్ణ నాయుడు కోరారు.

# మొక్కలు నాటేలా చర్యలు తీసుకోండి : కమిషనర్



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వైఓ నందన్ నగర పర్యటనలో భాగంగా స్థానిక 15 డివిజన్ బాలాజీ నగర్ పరిసర ప్రాంతాలలో అధికారులతో కలిసి మంగళవారం వివిధ అభివృద్ధి పనులను పరిశీలించారు. పూలే బొమ్మ ప్రాంతంలో బ్రిడ్జి మరమ్మత్తు పనులను పరిశీలించి, నిర్మాణ నాణ్యతలను తనిఖీ చేశారు. నిర్దేశించిన సమయంలోపు నిర్మాణ పనులను పూర్తిచేసి రాకపోకలను తిరిగి పునరుద్ధరించాలని సూచించారు. బాలాజీ నగర్ ప్రాంతంలో నూతనంగా నిర్మిస్తున్న ఎండ్ టు ఎండ్ సిసి రోడ్డు నిర్మాణ పనులను కమిషనర్ పరిశీలించారు. మొక్కల పెంపకానికి తవ్విన గుంటలను పరిశీలించి డ్రైను కాలువలు దెబ్బతినకుండా మొక్కలను నాటేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు నగరపాలక సంస్థ ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు, వార్డు సచివాలయం కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

# జేవీవీ ఆధ్వర్యంలో వక్త-2026 పోటీలు



**మర్రిపాడు, మేజర్‌న్యూస్ :** మర్రిపాడు మండలంలోని చిలకపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం జనవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో విద్యార్థులకు వక్త-2026 పోటీలు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా జనవిజ్ఞానవేదిక జిల్లా ఉపాధ్యక్షులు కే.పోలయ్య విద్యార్థులకు సైన్స్ పట్ల సూచనలు, సలహాలు ఇచ్చారు. విద్యార్థులు సమాజంలో జరిగేటటువంటి మార్పులను గమనించి ముందుకు వెళ్లాలని సూచించారు. ఎప్పటికప్పుడు సైన్సును అలవర్చుకుంటూ విద్య పట్ల శ్రద్ధ వహించి ఉన్నత స్థాయికి ఎదగాలని వివరించారు. మండలంలోని మరి కొన్ని ఉన్నత పాఠశాలలో ఈ వక్త పోటీలు నిర్వహించి ఆ తరువాత మండల స్థాయిలో పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మారుతి కేశవ కుమార్, ఉపాధ్యాయులు శివరామిరెడ్డి, నరసింహులు తదితర ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

# వంద శాతం పన్నుల లక్ష్యాలను సాధించాలి



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వైఓ నందన్ పారిశుధ్య నిర్వహణ పనుల పర్యవేక్షణలో భాగంగా స్థానిక జ్యోతి నగర్ 2వ వీధి ప్రాంతంలో అధికారులతో కలిసి మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా డివిజన్ పరిధిలో డ్రైను కాలువల నిర్మాణ పనులను పరిశీలించి నాణ్యతతో పాటు నిర్దేశించిన సమయంలోపు పూర్తయ్యేలా పర్యవేక్షించాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. డివిజన్ పరిధిలో ప్రతి ఒక్క భవనాన్ని, ఆస్తిని అసెస్మెంట్ పరిధిలోకి తీసుకొని వచ్చి పన్నుల వసూళ్లు చేయాలని, నిర్దేశించిన సమయంలో 100 శాతం పన్నుల లక్ష్యాలను సాధించాలని రెవెన్యూ విభాగం అధికారులను కమిషనర్ ఆదేశించారు. డివిజన్ పరిధిలో నూతన భవన నిర్మాణాలకు తప్పనిసరిగా టౌన్ ప్లానింగ్ విభాగం అనుమతులు తీసుకునేలా నిరంతరం పర్యవేక్షించాలని, బిపిఎస్, ఎల్ఆర్ఎస్ పథకాలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలని టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులను కమిషనర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు నగరపాలక సంస్థ డిఈ ప్రసాద్, ఏఈ ఆర్చిత, రెవెన్యూ ఇన్స్పెక్టర్ యనమల శీనివాసులు, వార్డు అడ్మిన్లు సయ్యద్ అబ్దుల్ జబ్బర్, గంగరాజు, టౌన్ ప్లానింగ్ టిపిబిఓ శివ, ఇతర విభాగాల అధికారులు, సిబ్బంది, టిడిపి నాయకులు బూడిద పురుషోత్తం యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు నులిపురుగుల మాత్రలు



**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా విద్యార్థిని విద్యార్థులకు నులి పురుగుల నిర్మూలన మాత్రలు వేసినట్లు మండల మెడికల్ ఆఫీసర్ డాక్టర్ దేవి కృప అన్నారు. మంగళవారం గురుకుల పాఠశాలలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించి మాట్లాడారు. 12795 మంది పిల్లలకుఅల్బెండ జోల్ మాత్రలు వేసినట్లు మెడికల్ ఆఫీసర్ తెలిపారు. 68 అంగన్వాడి కేంద్రాలు, ఆరు జూనియర్ కళాశాలలు, 83పాఠశాలల్లో విద్యార్థులకు మాత్రలు వేయడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ ఉన్నతాధికారి మధు సూదన్, ప్రిన్సిపల్ సుజాత, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# తాటిపర్తిలో బైక్ దగ్ధం చేసిన దుండగులు

**● ఐదు రోజుల క్రితం ఇంటికి కరెంట్ పెట్టిన ఆగంతకులు ● ఎవరో తనపై కుట్ర చేస్తున్నారన్న బాధితుడు రమణయ్య**



**పొదలకూరు, మేజర్‌న్యూస్ :** మండలంలోని తాటిపర్తి గ్రామంలో గుడిపాటి రమణయ్య బైక్‌ను మంగళవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు తగలబెట్టారు. గ్రామంలో హెయిర్ కటింగ్ షాప్ పెట్టుకొని జీవనం సాగిస్తున్న రమణయ్య పై ఎవరో కుట్ర చేస్తున్నట్లు తెలుస్తోంది. అందుకు గడిచిన అయిదు రోజులుగా వాళ్ల ఇంటివద్ద జరుగుతున్న సంఘటనలు బలం చేకూరుస్తున్నాయి. బాధితుడు రమణయ్య కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. అయిదు రోజుల క్రితం యధావిధిగా రోజులానే ఇంట్లో నిద్రించారు. శుక్రవారం తెల్లవారుజామున భార్య ప్రభావతి నిద్రలేచి తలుపు తీసే క్రమంలో కరెంట్ షాక్ కు గురైంది. కరెంట్ షాక్ తో పెద్దగా కేకలు వేయడంతో భర్త రమణయ్య డోర్ తీసే ప్రయత్నం చేయగా రమణయ్యకు కూడా విద్యుత్ షాక్ తగిలింది. విద్యుత్ షాక్ నుంచి తేరుకున్న రమణయ్య గుడ్డ పట్టుకుని డోర్ ఓపెన్ చేసి చూడగా బయట డోర్‌కి ఎవరో విద్యుత్ వైర్లు అమర్చినట్లు గుర్తించారు. అంటే రమణయ్య కుటుంబ సభ్యులను హతమార్చేందుకు ఎవరో కుట్ర చేస్తున్నారని దీనిని బట్టి అర్థమవుతోంది. ప్రాణాపాయం నుంచి బయటపడ్డ రమణయ్య దంపతులు తమను చంపేందుకు ఎవరు మా ఇంటి తలుపుకు కరెంటు అమర్చారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో సోమవారం రాత్రి 10 గంటల సమయంలో ఇంటి ముందున్న వీధిలో తన బైక్‌ను నిలిపి లాక్ చేసుకుని వెళ్ళాడు. తెల్లవారుజామున చూసేసరికి వీధిలో ఉన్న బైక్‌ను ఇంటి ముందుకు తీసుకొచ్చి తగులబెట్టారు. ఐదు రోజుల నుంచి జరుగుతున్న వరుస సంఘటనలను బట్టి చూస్తే మృదు స్వభావి, అందరితో కలుపుగోలుగా ఉండే రమణయ్య కుటుంబంపై ఎవరో కుట్ర చేస్తున్నారనే అనుమానాలు కలుగుతున్నాయి. పోలీసు అధికారులు విచారణ జరిపి కుట్రకు పాల్పడుతున్న ఆగంతకులను గుర్తించి చర్యలు తీసుకోవాలని బాధిత కుటుంబ సభ్యులు వేడుకుంటున్నారు. ఈ మేరకు పొదలకూరు ఎస్‌ఐ షేక్ మహమ్మద్ హనీఫ్ సంఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ప్రకృతి వ్యవసాయం పట్ల ఆసక్తిచూపాలి

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ప్రకృతివ్యవసాయం అత్యంత బహుళ ప్రయోజనకరమని, రైతులు ఆసక్తి చూపేలా సిబ్బంది కృషిచేయాలని ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ కె.కన్నయ్య కోరారు. మంగళవారం ఆత్మ కూరు డివిజన్‌పరిధిలో సమీక్షా సమావేశం నిర్వహించగా ఆయన పాల్గొని ప్రసంగించారు. ప్రకృతివ్యవసాయం వ్యయం తక్కువగా ఉంటుందని, నాణ్య మైన ఉత్పత్తులు లభిస్తాయని, లాభసాటిగా ఉంటుందన్నారు. ప్రస్థుత పరిస్థి తులు, ఎన్‌ఎంఎన్‌ఎఫ్ గ్రామాల్లో మట్టినమూనాల సేకరణ, గ్రామస్థాయిలో సిబ్బంది పనితీరు, రైతుస్థాయిలో తీసుకోవాల్సిన చర్యలు తదితర అంవాల గురించి ఆయన వివరించారు. ఆర్‌టిసి రవిచంద్ర ఆధ్వర్యంలో ఈ సమాక్షా సమావేశాన్ని నిర్వహించారు. డివిజన్ పరిధిలో మట్టినమూనా సేకరణ ప్రగతి, అమలువిధానం మరియు ఫీల్డ్‌స్తాయి కార్యకలాపాలుపై విస్తృతంగా చర్చించారు. మండల సిబ్బంది, ఎఫ్‌ఎంటిలు, ఐసిఆర్‌పిలు, టిఐసిఆర్‌పిల సనితీరును కూడా సమీక్షించారు. ఎన్‌ఎఫ్‌ఏ చంద్ర, ఎఫ్‌ఎంటిలు, సిడిఐ, ఐసిఆర్‌పిలు, ఏపిసిఎన్‌ఎఫ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నులిపురుగుల నివారణకు ప్రభుత్వం ప్రత్యేకదృష్టి



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** నులిపురుగుల నివారణకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ప్రతిష్టాత్మకంగా మాత్రలు మ్రింగించే కార్యక్రమం నిర్వహిస్తునందని జిల్లా మలేరియా అధికారిణి డాక్టర్ ఇ.హుస్సేనమ్మ పేర్కొన్నారు. మంగళవారం ఆత్మకూరు మున్సిపల్ పరిధిలో వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో జాతీయనులిపురుగుల దినోత్సవం సందర్భంగా 1నుండి 19 సంవత్సరాల వారికి నులిపురుగుల నివారణకు అల్బెండాజోల్ మాత్రలను మ్రింగించే కార్యక్రమం నిర్వహించారు. స్థానిక అర్బన్ పిహెచ్‌సి వైద్యాధికారిణి డాక్టర్ షేక్ అస్మా ఆధ్వర్యంలో ఈకార్యక్రమం నిర్వహించగా జిల్లా మలేరియా అధికారిణి డాక్టర్ హుస్సేనమ్మ పరిశీలించారు. అన్ని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో 1నుండి2సంవత్సరాల వారికి అర్ధమాత్ర, 2నుండి19సంవత్సరాల వారికి ఒక మాత్రవంతున అందరిచేతా నమిలి మ్రింగించారు. నులిపురుగుల వలన జీర్ణవ్యవస్థకు ఇబ్బంది కలుగుతుందని, కడుపునొప్పి, అలసట, రక్తహీనత కలుగుతుందని, అందువలన నులిపురుగుల నివారణకు ప్రతి ఏడా 1నుండి 19సంవత్సరాల వారికి ఆల్‌బెండాజోల్ మాత్రలు నేరుగా ప్రతిఒక్కరికి పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో వారిచేత నమిలిమ్రింగిస్తుంటామని హుస్సేనమ్మ పేర్కొన్నారు. ఏపి మాడల్ బాలికల పాఠశాలలో ఆల్‌బెండాజోల్400ఎంజి మాత్రలను పంపిణీ చేశారు. హాజరు వివరాలు, రికార్డుల నిర్వహణ అంశాలను సమీక్షించారు. ఈకార్యక్రమంలో వైద్యాధికారిణి డాక్టర్ అస్మా, ఐసిడిఎస్ సిడిపివో పి.సునీలత, వైద్య,ఆరోగ్య సిబ్బంది ఖాదర్‌బాషా, సిద్ధం సుధాకర్, రవీంద్రారెడ్డి, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## వ్యక్తిత్వ వికాసంపై అవగాహన

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** విద్యార్థి స్థాయి నుంచే ఆలోచనలు, ప్రవర్తన, మాట తీరు, నమ్మకం, నైపుణ్యాల వంటి లక్షణాలను మెరుగుపర్చుకొని మంచి వ్యక్తిత్వాన్ని ఏర్పర్చుకోవాలని డాక్టర్ కె.వేణుగోపాల్ సూచించారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు దుత్తలూరు సీడ్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులు జరగనున్న పబ్లిక్ పరీక్షల్లో వత్తిడికి గురికాకుండామనసును ప్రశాంతంగా ఉంచుకొని పరీక్షలు రాసి మంచి ఫలితాలు సాధించాలన్నారు. సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ ప్రణాళికబద్ధంగా చదవాలన్నారు. మంచి పోషకాలు కలిగిన ఆహారం తీస కుంటూ ఆరోగ్యకరంగా ఉండి ఒత్తిడిని జయించాలన్నారు. క్రమశిక్షణతో మెలిగితే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చన్నారు. అనంతరం పలు సూచనలు, సలహాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు, జనవిజ్ఞాన వేదిక నాయకులు దస్తగిరి అహ్మద్, గాజులపల్లి రామిరెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## మహిమలూరు పిహెచ్‌సి పరిధిలో డీవార్మింగ్ కార్యక్రమం



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు మండలం మహిమలూరు పిహెచ్‌సి పరిధిలో వైద్యాధికారులు డాక్టర్ దేవానంద్, డాక్టర్ స్వప్నారెడ్డిల ఆధ్వర్యంలో మంగళవారం జాతీయ నులిపురుగల దినోత్పవం సందర్భంగా నులిపురుగుల నివారణా కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా గ్రామ సర్పంచ్ పి.చంద్రశేఖర్ హాజరయ్యారు. 1నుండి 19సంవత్సరాల వారికి నులిపురుగుల నివారణకుగాను ఆల్‌బెండాజోల్ మాత్రలను మ్రింగించారు. ఈసందర్భంగా డాక్టర్ స్వప్నారెడ్డి మాట్లాడుతూ నులిపురుగుల వలన కలిగే దుష్ప్రరిణామాలను గురించి వివరించారు. పిల్లలు ఆరోగ్యంగా ఉంటేనే చదువులో రాణించగలరన్నారు. నులిపురుగుల వలన రక్తహీనత ఏర్పడుతుందని, కడుపునొప్పి, అలసట తదితర ఇబ్బందులు కలుగుతాయని , నులిపురుల నివారణకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధతో డీవార్మింగ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తుందన్నారు. ప్రతి పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాల్లో అల్‌బెండాజోల్ మాత్రలను మ్రింగిస్తున్నామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఇస్మాయిల్, ఆరోగ్యకార్యకర్త పఠాన్‌జిలానీబాషా, ఏఎన్‌ఎం శంషాద్, ఉపాధ్యాయులు రమేష్‌బాబు, వెంకటేశ్వర్లు, రేవతి, ఆశాకార్యకర్తలు సుజాత, మల్లీశ్వరి, భాగ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఖాళీల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** మండలంలోని గండిపాళెం బాలుర గురుకుల పాఠశాలలో 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి 5, 6, 7, 8వ తరగతుల్లో మిగిలి ఉన్న ఖాళీల భర్తీకి ఆన్లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ అబ్దుల్ గఫూర్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బుధవారం ఈనెల 31వ తేదీలో ఆన్లైన్ ద్వారా దరఖాస్తు దాఖలు చేసుకోవాలన్నారు. వీరికి ఏప్రిల్ 24న పరీక్ష నిర్వహిస్తున్నారన్నారు. మరిన్ని వివరాలకు 8712625047, 8919118986 అనే నెంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు.

## జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం

**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నగరంలోని మహిళా స్వశక్తి భవనం నందు 1-19 సంవత్సరాల పిల్లలకి నులి పురుగుల నివారణ గురించి అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సెక్రటరీ సరిత మాట్లాడుతూ పిల్లలు చేతులు పరిశుభ్రత గా లేకపోవడం వల్ల నులి పురుగులు కడుపు లో చేరి ఆకలి లేకపోవడం, రక్త హీనత వస్తుంది, జీర్ణ శక్తి తగ్గుతుంది కావున 400మి.గ్రా ఆల్బెండజోల్ మాత్రలు ప్రతి ఒక్కరు కనీసం 3 నెలలకు ఒకసారి వేసుకోవాలని అన్నారు. నెల్లూరు జిల్లా మెప్మా హెల్త్ అండ్ న్యూట్రిషన్ కాంతయ్య మాట్లాడుతూ.. పిల్లలు, పెద్దలు చేతులు పరిశుభ్రంగా లేకపోవడం వల్ల 70శాతం వ్యాధులు వస్తాయని తెలిపారు. అదే ప్రస్తుత కాలంలో పౌష్టికాహారం లోపం ఎక్కువగా కనబడుతుంది. విటమిన్ లోపం, హార్మోన్‌ల లోపం వస్తున్నాయి గనుక ప్రతి సంఘ మహిళ తాను ఆరోగ్యంగా ఉంటూ, తన కుటుంబ సభ్యులు కూడా ఆరోగ్యంగా ఉండేట్లు చూసుకోవాలని అన్నారు. అలాగే సఖి సురక్ష ద్వారా చేసిన పరీక్షల రిపోర్ట్‌లు అందరికీ వచ్చి ఉన్నాయని, హెల్త్ రిసోర్స్ పర్సన్‌లు వారిని నెట్వర్క్ హాస్పిటల్‌లకు పంపే కార్యక్రమం చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్పీలు, హెల్త్ రిసోర్స్ పర్సన్‌లు, సిఓలు ఝాన్సీ, సురేష్, కిరణ్, గీతా, ఆబిద్ అలీ బేగ్, శశి కిరణ్ సిఎంఎంలు జరీనా, కవిత పాల్గొన్నారు.

## ఎన్‌వైకే వాలంటీర్లు నోటిఫికేషన్ విడుదల

**కలిగిరి, మేజర్‌న్యూస్ :** నెల్లూరు జిల్లాలో మై భారత్ యువ వాలంటీర్ల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా యువజన అధికారి ఆకుల మహేంద్ర రెడ్డి తెలిపారు. ఆసక్తి కలిగిన మరియు అర్హత కలిగిన యువత ఈ అవకాశాన్ని వినియోగించుకొని వెంటనే దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ నియామకానికి అభ్యర్థులు కనీసం 10వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలి. 01 ఏప్రిల్ 2025 నాటికి వయస్సు కనీసం 18 సంవత్సరాలు, గరిష్టంగా 29 సంవత్సరాలు ఉండాలని నెల్లూరు జిల్లా వాసులై ఉండాలి తెలిపారు. ప్రస్తుతం రెగ్యులర్ విద్యార్థులుగా చదువుతున్న వారు ఈ పథకానికి అర్హులు కారని స్పష్టం చేశారు. ఎంపిక ప్రక్రియలో ఉన్నత విద్యార్హతలు కలిగి కంప్యూటర్ పరిజ్ఞానం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడుతుందని, అలాగే మై భారత్ అనుబంధ యువజన సంఘాల సభ్యులకు ప్రాధాన్యత కల్పించబడుతుందని తెలిపారు. ఎంపికైన యువ వాలంటీర్లకు నెలకు రూ.5వేల గౌరవ వేతనం అందించబడుతుందని తెలిపారు. దరఖాస్తుల స్వీకరణకు ఈనెల 20వ తేదీ చివరి తేదీగా నిర్ణయించబడినందున ఆసక్తి కలిగిన యువత గడువు లోపు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా యువజన అధికారి ఆకుల మహేంద్రరెడ్డి కోరారు. https://nyks.nic.in/nycapp/main.asp అనే వెబ్ సైట్ ద్వారా, లేదా మరిన్ని వివరాల కొరకు 9963533440 సంప్రదించగలరని తెలియజేశారు.

## విద్యార్థులకు నులిపురుగుల మందులు పంపిణీ

**వరికుంటపాడు, మేజర్‌న్యూస్ :** నులిపురుగుల వలన రక్తహీనత శారీరక ఎదుగుదల లోపం, కడుపునొప్పి, ఆకలి లేకపోవడం వంటి సమస్యలు ఎదురవుతాయని, ఆల్బెండజోలు మాత్రల వలన ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని డాక్టర్ ఆయేషా తెలిపారు. ఈ మేరకు జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా మండలంలో అన్ని గ్రామ పంచాయతీలో ఒకటి నుండి తొమ్మిది సంవత్సరాల పిల్లలందరికీ 3127మంది పిల్లలకు ఆల్బెండజోలు టాబ్లెట్లను సిబ్బందితో కలిసి డాక్టర్ ఆయేషా చేతులమీదగా విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో సిహెచ్‌ఓ రాజశేఖర్, నౌషాద్ బాషా, ఏఎన్‌ఎం జానకి, యనమల శ్రీను, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం

**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రూరల్ మండలంలోని సౌత్ మోపూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని సౌత్ మోపూరు బీసీ కాలనీ, కలుజుల మిట్ట, అంగన్ వాడి కేంద్రాలు, స్కూల్స్‌ను డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ బట్టేపాటి అశోక్ సందర్శించి, జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం కార్యక్రమాన్ని పరిశీలించారు. అనంతరం డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మాట్లాడుతూ.. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం(నేషనల్ డెవర్మింగ్ డే) సందర్భంగా 1 సంవత్సరం నుండి 19 సంవత్సరాల వయస్సు ఉన్న స్కూలుకి వెళ్లే పిల్లలకు, స్కూల్‌కి వెళ్ళని పిల్లల అందరికీ ఆల్బెండజోల్ 400ఎం.జి మాత్రలు ఉచిత పంపిణీ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని, ఆరోగ్యం బాగా లేక ఇతర కారణాల వలన 17వ తేదీ అనగా ఈరోజు మాత్రలు వేసుకోకుండా ఉన్న పిల్లలకు ఫిబ్రవరి 24వ తేదీన మాప్ అప్ కార్యక్రమంలో ఇవ్వటం జరుగుతుందని తెలియజేశారు. మానసిక శారీరక ఎదుగుదల సమస్యలను అరికట్టడం. నివారణ ఆహారం తీసుకునే ముందు, మలవిసర్జ న జరిగిన తర్వాత చేతులు పరిశుభ్రంగా సబ్బుతో కడుక్కోవాలి. గోళ్ళు కత్తిరించుకోవాలి. ఈ కార్యక్రమంలో స్కూల్ టీచర్లు, ఆశా కార్యకర్తలు, అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

# పట్టాలు ఇచ్చిన భూములకు హద్దులు చూపండి

- అధికారులు ఆక్రమణదారులకు కొమ్ము కాస్తున్నారు
- తహసిల్దార్ కార్యాలయం వద్ద గట్టుపల్లి దళితుల ఆందోళన



**జలదంకి, మేజర్‌న్యూస్ :** తమకు పట్టాలు అందించిన భూములకు వెంటనే హద్దులు చూపి ఆ భూములను తమకు అందించాలని జలదంకి మండలం గట్టుపల్లి గ్రామానికి చెందిన దళితులు ఆందోళనకు దిగారు. మంగళవారం తహసిల్దార్ కార్యాలయం వద్ద వారు నిరసన కార్యక్రమం చేపట్టారు. తమకు భూములు అందించేంతవరకు కదిలేది లేదు అంటూ నినాదాలు చేశారు. తమ సమస్య పరిష్కారం అయ్యేవరకు కార్యాలయం వద్ద వంటావార్పు కార్యక్రమం చేపట్టేందుకు యత్నించారు. గ్రామంలో రెవెన్యూ అధికారులు ఆక్రమణదారులకు కొమ్ము కాస్తూ తమకు అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. దీంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. దీంతో కావలి డిఎస్పి శ్రీధర్ తన సిబ్బందితో అక్కడికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. అనంతరం ఆయన తహసిల్దార్ సీతామహాలక్ష్మితో వారి సమస్యపై చర్చించారు. ధర్నా చేపట్టిన వారితో మాట్లాడారు. పది రోజుల్లో వారి సమస్యను పరిష్కరిస్తామని తాసిల్దార్, డీఎస్పీలు వారికి హామీ ఇచ్చారు. పది రోజుల్లో సమస్య పరిష్కారం కాకపోతే సమస్యను ఉధృతం చేస్తామని భూముల లబ్ధిదారులు తెలిపారు. అనంతరం అధికారుల సూచనల మేరకు ధర్నా విరమించారు. ఈ సమస్యపై తహసిల్దార్ సీతామహాలక్ష్మిని వివరణ కోరగా పది రోజుల్లో నివేదికలు తయారుచేసి పై అధికారులకు అందిస్తానని, గట్టుపల్లి గ్రామానికి చెందిన దళితులకు న్యాయం చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో జలదంకి ఎస్ఐ లతీపున్నిసా, దళిత నాయకులు ముసలి వెంకటరమణయ్య, కాకాని జనార్ధన్, వట్టికల మాల్యాద్రి, మల్లికార్జున, దానం భద్రయ్య, దాసరి అభిషేక్, భూముల లబ్ధిదారులు పాల్గొన్నారు.

# ఆల్బెండజోల్ మాత్రలతో నులిపురుగులను నివారించవచ్చు



- అపరిశుభ్రత వల్లే నులిపురుగులు పిల్లలకు సంక్రమిస్తాయి
- జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం
- జీజీహెచ్ చిన్నపిల్లల వైద్య నిపుణులు డాక్టర్ ఆర్.చందన్ రెడ్డి

**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** నేటి ఆధునిక సమాజంలో, జీవన విధానంలో ఆహారపు అలవాట్లు కారణంగా చిన్నపిల్లల్లో నులిపురుగుల సమస్య తీవ్రంగా ఉందని, ఇందు నిమిత్తం పీహెచ్‌పీ అసోసియేషన్ వారు నిర్మూలన అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం ఎంతో అభినందనీయమని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి చిన్నపిల్లల వైద్య నిపుణులు డాక్టర్ ఆర్.చందన్ రెడ్డి అన్నారు. జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమం సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సహకారంతో కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (పిఎంపి అసోసియేషన్ ఆఫ్ ఇండియా) ఆధ్వర్యంలో బుజబుజ నెల్లూరులోని శేషు ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ నందు మంగళవారం జరిగిన అవగాహన సదస్సు, ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న జాతీయ నులిపురుగుల నివారణను ఏడాదికి రెండుసార్లు నులిపురుగులు నివారణ చర్యలు చేపడుతుందని, ప్రస్తుత జీవన విధానం, ఆహారపు అలవాట్లు కారణంగా ఒకటి నుంచి 19 ఏళ్ల లోపల పిల్లల్లో నులిపురుగుల సమస్య తీవ్రంగా ఉందని అన్నారు. ఈ కారణంగా పిల్లలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, పౌష్టికాహార లోపం, బలహీనత, ఆందోళన, కడుపునొప్పి, వాంతులు, విరోచనాలు వంటి సమస్యలు కూడా ఏర్పడడంతో కొందరిలో శారీరక, మానసిక ఎదుగుదల మందకొడిగా ఉంటుందని తెలిపారు. ఒకటి నుండి రెండు సంవత్సరాల లోపు పిల్లలకి సగం మాత్ర మిగతా వారికి పూర్తి మాత్రం నమిలి మింగాలని అన్నారు. కలుషితమైన ఆహారాలు లేదా పానీయాలు తీసుకోవడంవల్ల ఈ నులిపురుగులు సంభవిస్తాయని, వీటిని నిర్మూలించేందుకు ఆల్బెండజోల్ మాత్రలు తీసుకోవాలని, ఐదేళ్ల లోపు చిన్నారులకు సిరప్, ఐదేళ్లు దాటిన వారికి మాత్ర మధ్యాహ్నం భోజనానంతరం వేయాలి అన్నారు. అనంతరం 25వ డివిజన్ కార్పొరేటర్ బద్దెపూడి నరసింహగిరి మాట్లాడుతూ.. ఆరోగ్యవంతమైన పిల్లల కోసం నులిపురుగులను నులిమేద్దాం, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు ఇతర వ్యాధులకు మందులు వాడుతున్న వారు ఈ మాత్ర వేసుకోకూడదు అన్నారు. ముఖ్యంగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోకపోతే నులిపురుగులు వ్యాపిస్తాయని, కలుషిత ఆహారము, ఈగలు వాలిన తినుబండారాలు, దుమ్ము, ధూళి పడిన ఆహార పదార్థాలు తినడం వల్ల, బహిరంగ ప్రదేశాల్లో మలవిసర్జన ద్వారా, కాళ్లకు చెప్పులు లేకుండా మరుగుదొడ్డికి వెళ్లడం ద్వారా, ఆకుకూరలు, కాయగూరలు, పండ్లు వంటివాటిని శుభ్రమైన నీటితో కడగకపోవడం వల్ల వ్యాపిస్తాయని అన్నారు. మలవిసర్జన తర్వాత, భోజనం చేసేముందు శుభ్రంగా చేతులు కడుక్కోవాలని, ఆహార పదార్థాలపై ఎల్లప్పుడూ మూతలు కప్పి ఉంచాలన్నారు. 2017 నుంచి ప్రతి సంవత్సరం జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం నిర్వహిస్తున్నారని, దీనిని కేంద్ర ఆరోగ్య కుటుంబ మంత్రిత్వ శాఖ అమలు చేస్తుందన్నారు. అలాగే యూపిహెచ్‌సి కోఆర్డినేటర్ కొండాపురం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం రోజున డివార్మింగ్ చేయబడని పిల్లలకు ఫిబ్రవరి 24వ తేదీన జరిగే మాప్-అప్ రోజున ఆల్బెండజోల్ 400 మిల్లీగ్రాముల మాత్రలు వేయడం జరుగుతుందన్నారు. పిల్లలు, కిషోర్ బాలల కడుపులో నులిపురుగులు ఉన్నట్లయితే పోషకాహార లోపం, రక్తహీనత వల్ల నీరసంగా ఉంటారని, శారీరక, మానసిక, ఎదుగుదల లోపాలు కలిగి ఉంటారని అన్నారు. అనంతరం నిర్వాహకులు డాక్టర్ ఆర్.చందన్ రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రూడ్స్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ షేక్ రసూల్, జనసేన 25వ డివిజన్ అధ్యక్షులు కుడుముల సురేష్, పిహెచ్‌పి నాయకులు శాఖవరపు వేణుగోపాల్, దేవరకొండ శ్రీనివాసులు, ఏఎన్ఎం ఎ.పావని, ఆశ వర్కర్ ఆర్.యశోద, స్కూల్ ఇన్చార్జి బోనబోయిన యశ్వంత్, టిప్పు తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా అన్న లింగ నిమజ్జనం



**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** కృష్ణపట్నం మహాశివరాత్రి వేడుకలు ముగిసినాయి. చివరి రోజు మంగళవారం సిద్దేశ్వర స్వామి అన్న లింగ నిమజ్జనం వైభవంగా జరిగింది. ఈనెల 15వ తేదీన ప్రారంభమైన ఈ వేడుకలు మూడు రోజులపాటు ఘనంగా నిర్వహించారు. సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి సహకారం అందించారు. ఈ నేపథ్యంలో అన్న లింగ ప్రతిష్ట ఘనంగా చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ రూపంలో ఉన్న సిద్దేశ్వర స్వామిని దర్శించుకుని పరవశించిపోయినారు. అదేవిధంగా గంగమ్మ ఉత్సవం కనుల పండుగగా చేశారు. మేళ తాళాలు మంగళ వాయిద్యాలు బాణసంచా పేలుళ్లు వేదమంత్రాలు మధ్య ఓం నమశ్శివాయ ఓం నమశ్శివాయ హరహర మహాదేవ శంభో శంకర అంటూ స్వామిని వేడుకుంటూ ఈ కార్యక్రమాన్ని చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు విశేష పూజలు జరిగినాయి. వేల మంది భక్తులు పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. ఆలయాల పాలకమండలి చైర్మన్ మామిడాల శ్రీనివాసులు దంపతులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్య నిర్వహణ అధికారి గిరి కృష్ణ, పాలక మండలి సభ్యులు, శివ భక్తులు రాగాల శివకృష్ణ, భజన బృందం, గ్రామస్తులు హాజరయ్యారు. స్థానికులతో పాటు ఇతర ప్రాంతాల భక్తులు కూడా విచ్చేశారు. కార్యక్రమాలు ముగింపు తర్వాత అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంత్రం వరకు అన్నదానం జరిగింది. ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీస్ శాఖ బందోబస్తు నిర్వహించింది. భక్తులకు అవసరమైన మౌలిక సదుపాయాలను రాష్ట్ర ప్రభుత్వం కల్పించింది. ఆలయ అర్చకులు నగేష్ బాబు శర్మ పూజ కార్యక్రమం చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు విశిష్ట గుర్తింపు సంఖ్య



**జలదంకి, మేజర్‌న్యూస్ :** రైతులకు విశిష్ట గుర్తింపు సంఖ్య తప్పనిసరి అని మండల వ్యవసాయ అధికారిని శ్రీవాణి తెలిపారు. ఏ సంఖ్య లేకపోతే ప్రభుత్వ పథకాలు కోల్పోతారని వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ సత్యవాణి అన్నారు. మంగళవారం జలదంకి మండలంలోని చామదల గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. దేశవ్యాప్తంగా ఉండే రైతులందరికీ ఒక్క నంబరు గుర్తింపుగా ఇస్తారన్నారు. పంటల బీమా అందాలన్నా, పంట నష్టపరిహారం పొందాలన్నా, సబ్సిడీ తీసుకోవాలన్న గుర్తింపు నంబరు అవసరం అన్నారు. ఈ కార్యక్రమంలో జెడిఏ ఆఫీస్ ఏడిఏ నాగసాయి, శరత్, రైతులు పాల్గొన్నారు.

## తిమ్మసముద్రంలో పులివెందుల రాజ్యాంగం



**జలదంకి, మేజర్‌న్యూస్ :** రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన కూడా జలదంకి మండలంలోని తిమ్మసముద్రంలో ఇప్పటికీ పులివెందల రాజ్యాంగం అమలులో ఉందని టీడీపీ నాయకులు వినోద్ నాయుడు ఆరోపించారు. ఇందుకు ఉదాహరణ కాసు మహేశ్వరరావు కుటుంబంపై జరిగిన దాడి అన్నారు. కాసు మహేశ్వరరావు అనే అతను జామాయిల్ పంటసాగు చేసుకుని కొట్టేందుకు మంగళవారం ఉదయం పొలంలోకి వెళ్తుంటే, నాగే వెంకటేశ్వర్లు అనే అతనితోపాటు అతని కుటుంబ సభ్యులు అడ్డగించి మహేశ్వరరావు కుటుంబాన్ని గాయపరిచారన్నారు. గతంలో నాగే వెంకటేశ్వర్లు 15 ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమించి అమ్ముకున్నాడని, ప్రస్తుతం కూడా వాగును ఆక్రమించి వరి నాటి ఉన్నాడని, 5 ఎకరాల నిమ్మతోట ఉందని మరో రెండు ఎకరాలు కూడా ఆక్రమించి ఉన్నాడన్నారు. వైసిపి నాయకులు, అనుచరుల వద్ద దాదాపు 200 ఎకరాల ప్రభుత్వ భూమి ఆక్రమంలో ఉందని, ప్రభుత్వ అధికారులు స్పందించి వెంటనే భూమిని స్వాధీనం చేసుకోవాలన్నారు. లేనిపక్షంలో ఇలాగే గొడవలు జరిగి ఒకరికొకరు పొడుచుకునే ప్రమాదం ఉందన్నారు. గాయాల పాలైన కాసు రామసుబ్బమ్మ కాసు పద్మమ్మలను కావలి ఏరియా వైద్యశాలలో చికిత్స కోసం చేర్పించారు. నాగే వెంకటేశ్వర్లు వేణుగోపాల్ సుభాషిని లక్ష్మమ్మ మబ్బు మనోజ్ కోటేశ్వరరావు దాడి చేశారని బాధితులు చెబుతున్నారు.

## కలిగిరిలో జాతీయ నులిపురుగుల దినోత్సవం

**కలిగిరి, మేజర్‌న్యూస్ :** అపరిశుభ్రత, కలుషితమైన ఆహారం తీసుకోవడం వలన నులిపురుగులు వ్యాప్తి చెందుతాయని కలిగిరి ఆరోగ్య సిబ్బంది డాక్టర్ ఆకాష్ రెడ్డి తెలియ జేశారు. సోమవారం మండల కేంద్రం కలిగిరి ఆదర్శ పాఠశాలలో, జిల్లాపరిషత్ హైస్కూల్‌తోపాటు అన్ని గ్రామాల్లో ప్రాథమిక పాఠశాలలు, ప్రైవేటు పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలలో ఆరోగ్య సిబ్బంది అల్బెండ జోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ బిజ్జం గీతారెడ్డి మాట్లాడుతూ.. 1-19 సంవత్సరాల గల 7594 మంది పిల్లలకు గాను 7290 మందికి 96శాతం నులిపురుగుల నివారణకు ప్రభుత్వం ద్వారా అల్బెండజోల్ మాత్రల పంపిణీ చేసి మింగించడం జరిగిందన్నారు. అపరి శుభ్రత, కలుషితమైన ఆహారం తీసుకోవడం వల్ల నులిపురుగులు పేగుల్లో అభివృద్ధి చెందుతాయని దీనికారణంగా రక్తహీనత, పోషకాహార లోపం, కడుపునొప్పి, విరోచనాలు, బరువు తగ్గడం వంటి అనారోగ్య సమస్యలు వస్తాయన్నారు. వీటి బారినుండి తప్పించుకునేందుకు శుభ్రత పాటించి మంచి ఆహారాన్ని తీసుకోవాలన్నారు. స్కూలుకు హాజరుకాని విద్యార్థిని, విద్యార్థులకు 24వ తేదీన మాఫ్ ఆఫ్ డే నిర్వహించి మింగించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సాయి లక్ష్మి, మేరీ, హెల్త్ అసిస్టెంట్ ఎన్. లక్ష్మీప్రసాద్, ఎమ్మెల్ హెచ్‌పిలు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, ప్రభుత్వ, ప్రైవేటు స్కూల్ యాజమాన్యం పాల్గొన్నారు.

## జాతీయ నులిపురుగుల దినోత్సవం కార్యక్రమం

**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రూరల్ మండలంలోని సౌత్ మోపూర్‌లోని ఎంపీపీ స్కూల్ నందు జాతీయ నులిపురుగుల దినోత్సవం కార్యక్రమంలో భాగంగా మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రవీంద్రనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆల్ బెండజోల్ టాబ్లెట్లు మింగించారు. నులిపురుగుల వలన కలుగు నష్టాల గురించి వివరించడం జరిగింది. అదేవిధంగా ఈనెల పురుగులు కడుపులో పెరగటం వలన బిడ్డ ఎదుగుదలకు నష్టం కలిగించును, నష్టం కలిగించును, రక్తహీనత ఆకలి మందగించటం, పిల్లలు చదువుల మీద కూడా ఆసక్తి కలిగించకపోవడం లాంటి దుష్ప్రభావాలు జరుగుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ రసూల్ బి, హెల్త్ అసిస్టెంట్ హెల్త్ అసిస్టెంట్ విజయసారధి, ఏఎన్ఎంలు సుబ్బమ్మ, ప్రియా, హెడ్మాస్టర్ జగదీష్ ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# తలసేమియా బాధిత చిన్నారులకు ఉచిత గుండె పరీక్షలు



**కావలి, మేజర్‌న్యూస్ :** గుంటూరు రమేష్ హాస్పిటల్స్‌కు చెందిన ప్రముఖ చిన్నపిల్లల గుండెవ్యాధి నిపుణులు మంగళవారం రెడ్‌క్రాస్ తలసేమియా డే కేర్ సెంటర్‌లో తలసేమియా బాధిత చిన్నారులకు 2డి ఎకో స్కాన్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా తలసేమియా మెడికల్ ఆఫీసర్, ప్రముఖ చిన్నపిల్లల వ్యాధి నిపుణులు డాక్టర్ పి.శ్రీధర్ మాట్లాడుతూ.. తలస్సేమియా బాధిత చిన్నారులకు తరచూ, రక్తం ఎక్కించడం వలన శరీరంలో ఐరన్ నిల్వలు పెరిగే అవకాశం ఉన్నందున వారికి శరీరంలోని ఐరన్ బయటకు వెళ్ళడానికి మందులు ఇస్తామని, దానితోపాటు ప్రతీ ఆరు నెలలకు గుండెకు సంభందించిన 2డి స్కాన్ పరీక్షలు చేయవలసిన అవసరం ఉందని అన్నారు. తన మిత్రులు, ప్రముఖ చిన్న పిల్లల గుండెవ్యాధి నిపుణులు డాక్టర్ ఆర్ జ్యోతి ప్రకాష్‌రెడ్డి తన ఖర్చులతో గుంటూరు నుండి వచ్చి, ఒక్కొక్కరికి మూడు వేల రూపాయలు ఖర్చు అయ్యే వైద్య పరీక్షలను 16 మందికి ఉచితంగా చేసారని అన్నారు. మిగతా వారికి అవసరమైనప్పుడు చేస్తారని వివరించారు. ఈ సందర్భంగా డాక్టర్ జ్యోతి ప్రకాష్ రెడ్డిని రెడ్ క్రాస్ బాధ్యులు ఘనంగా సత్కరించారు. కావలి పట్టణంలోని వ్యాపార ప్రముఖులు కొత్త సత్యనారాయణ తన మనమడు ఆశ్రీత్ జన్మదినాన్ని తలసేమియా చిన్నారుల మద్య నిర్వహించుకోవడంతో పాటు, తలసేమియా కేంద్రం నిర్వహణకు 10 వేల రూపాయలు విరాళం అందజేశారు. విశ్రాంత బ్యాంకు అధికారి రమణారెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొని, తలసేమియా కేంద్రం నిర్వహణకు ప్రతీ నెలా 4వేల ఐదు వందల రూపాయలు జీవితాంతం ఇస్తానని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ పాలక మండలి సభ్యులు డాక్టర్ బెజవాడ రవికుమార్, డి.రవిప్రకాష్, కె.హరి నారప రెడ్డి, కలికి శ్రీహరిరెడ్డి, బెజవాడ ప్రసన్నకుమార్, ఏ.రమేష్‌రెడ్డి (రోటరీ క్లబ్ అధ్యక్షులు), జూనియర్ రెడ్ క్రాస్ కన్వీనర్ జి.హరనాథ్, తలసేమియా కేంద్రం పోషక సభ్యులు మార్కండేయులు, సీతరామయ్య, ఇంజనీర్ అలహరి శ్రీనివాసకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# అత్యంత వైభవంగా మూలస్థానేశ్వరుని రథోత్సవం



**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు మూలాపేట, శ్రీ భువనేశ్వరి సమేత శ్రీ మూలస్థానేశ్వర స్వామి వారి దేవస్థానము నందు మహాశివరాత్రి బ్రహ్మోత్సవములలో భాగంగా ఎనిమిదవ రోజు మంగళవారం ఉదయం 10.30 గంటలకు శ్రీ స్వామి అమ్మవార్ల రథోత్సవం అత్యంత వైభవముగా నిర్వహించారు. ఈ పవిత్రోత్సవానికి భక్తులు వేల సంఖ్యలో హాజరై భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. ఉత్సవమూర్తులైన శ్రీ స్వామి అమ్మవార్లు అలంకార భూషితులై సువిశాల రథంపై అధిష్ఠించగా, వేద మంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాలు, హారతుల మధ్య రథం దేవస్థాన ప్రాంగణమునుండి పుర వీధులలో విహరించెను. భక్తులు "హర హర మహాదేవ" నినాదాలతో రథాన్ని లాగి తమ భక్తిని వ్యక్తపరచారు. దేవస్థాన అధికారులు, అర్చకులు, వేద పండితులు, సమన్వయంతో ఏర్పాట్లు చేపట్టి కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేయబడినవి. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా ప్రతిరోజు ప్రత్యేక పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు, ఘనంగా నిర్వహిస్తున్నట్లు దేవస్థాన అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమమునకు ఉభయకర్తలుగా ఆల్తురు గిరీష్ రెడ్డి , లతమ్మ ఏఎంఆర్ కన్స్ ట్రక్షన్స్, ఎస్ ఎస్ కన్స్ ట్రక్షన్స్ హైదరాబాద్ వారు వ్యవహరించారు.

# రాష్ట్ర ప్రభుత్వాన్ని మోసం చేస్తున్న హౌసింగ్ అధికారులు

- పేదలందరికీ ఇల్లు పథకం రాష్ట్రంలో నీరుగారిపోతుంది..
- రాష్ట్ర గవర్నర్, సీఎంకి మిడతల రమేష్ ఫిర్యాదు



**నెల్లూరు/వేదాయపాలెం, మేజర్‌న్యూస్ :** పేద ప్రజల అభివృద్ధి సంక్షేమాలే లక్ష్యంగా అన్ని వర్గాల అభ్యున్నతి కొరకు అహర్నిశలు కృషి చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వాన్ని హౌసింగ్ అధికారులు తమ స్వార్ధ ప్రయోజనాల కొరకు నిలువునా మోసం చేశారని బిజెపి నమామి గంగే రాష్ట్ర కన్వీనర్ మిడతల రమేష్ ధ్వజమెత్తారు. ఈ మేరకు మంగళవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడులకు ఫిర్యాదు చేసిన లేఖలోని వివరాలిలా ఉన్నాయి. తిరుపతి అర్బన్ హౌసింగ్ లేఔట్లలో అవినీతి అక్రమాలు జరిగినా.. ఇంతవరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తిరుపతి జిల్లాలో గృహ నిర్మాణాలలో వివిధ రకాల స్టేజీల డివియేషన్ ఉన్న 6,157 ఇళ్లకు అధిక చెల్లింపులు చేశారని, తిరుపతి అర్బన్ లేఅవుట్లలో 4173 గృహాలకు నిర్మాణ స్థాయిల కంటే అధిక చెల్లింపులు చెల్లించారన్నారు. హౌసింగ్ విజిలెన్స్ అధికారులు వెంకట కృష్ణయ్య, రాజు, సదరు అక్రమార్కులపై చర్యలు తీసుకోకుండా అసంపూర్తిగా ఉన్న నిర్మాణాలు పూర్తి చేయమని అధికారులకు ఒక అవకాశం ఇచ్చారన్నారు. హౌసింగ్ ఇన్చార్జి పిడిగా ఉన్న దయాకర్ కాలంలో జరిగిన అవినీతి అక్రమాలను కప్పిపుచ్చాలని తిరుపతి హౌసింగ్ అధికారులు నిర్ణయించుకున్నారన్నారు. అసంపూర్ణ నిర్మాణాలను పూర్తి చేయకుండానే పూర్తి చేసినట్లుగా 5243 గృహాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశారన్నారు. ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు శ్రీనివాసులు. అసిస్టెంట్ ఇంజనీరు రమణయ్య. డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మోహన్‌లు పథకం ప్రకారం రాష్ట్ర ప్రభుత్వానికి తప్పుడు నివేదిక సమర్పించారన్నారు. తిరుపతి జిల్లాలో 3818 గృహాలను పూర్తిచేసి లబ్ధిదారులకు అందించినట్లు రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పించారని, వాస్తవ రూపంలో సదరు గృహాలను లబ్ధిదారులకు ఇచ్చినట్లు తప్పుడు నివేదికలను ఆన్లైన్లో నమోదు చేశారన్నారు. రాష్ట్ర ప్రభుత్వాన్ని అధికారులు అంతా కలిసి మోసం చేశారని, అవినీతి అక్రమాలు చేసిన అధికారులపై అధికారులు చర్యలు తీసుకోకపోగా వారికి ఇన్చార్జి పదవులు ఇచ్చి అవినీతిని ప్రోత్సహిస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో హౌసింగ్ అక్రమాలు, అవినీతి వల్ల ప్రధాని నరేంద్ర మోడీ పేదలందరికీ ఇల్లు అంత్యోదయ లక్ష్యం నీరు గారిపోతుందన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జరిగిన అక్రమాలపై స్పందించి ప్రధాని నరేంద్ర మోడీ లక్ష్యాన్నికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

## శ్మశానానికి దారి లేక అవస్థలు



**కలిగిరి, మేజర్‌న్యూస్ :** శ్మశానానికి వెళ్లేందుకు దారి లేకపోవడంతో అవస్థలు పడుతున్నామని కృష్ణారెడ్డి పాలెం గ్రామ పంచాయతీలోని నడిమ మాదిగ పాలెం దళితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంత్యక్రియల నిమిత్తం మృతదేహాలను వాగులో నుండి తీసుకుపోవడం చాలా ఇబ్బందికరంగా ఎదురవుతున్నాయంటున్నారు. అధికారులు పరిశీలించి స్మశానికి ప్రత్యేకమైన దారి ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

## అడ్మిన్ కార్యదర్శి రాజశేఖర్ సస్పెన్షన్

**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వైఓ నందన్ ఆదేశాల మేరకు శోధన్ నగర్ వార్డ్ సచివాలయ అడ్మిన్ కార్యదర్శి చీమల రాజశేఖర్ విధులకు హాజరుకాని కారణంగా తాత్కాలికంగా సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులను మంగళవారం జారీ చేశారు. మెడికల్ లీవ్‌లో ఉన్న రాజశేఖర్ విధులకు తిరిగి హాజరుకావాలని నోటీసులు జారీ చేసినప్పటికీ ఇప్పటివరకు విధులకు హాజరుకాని కారణంగా సస్పెన్షన్ విధించినట్లు కమిషనర్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

# వజ్రోత్సవ గోడ పత్రిక ఆవిష్కరణ



**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** వెట్టి చాకిరి వ్యవస్థ నిర్మూలన చట్టం-1976 అమలుకు 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా దేశవ్యాప్తంగా వజ్రోత్సవాలు నిర్వహిస్తున్న నేపథ్యంలో నెల్లూరు జిల్లాలో అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించారు. తొమ్మిదో తేదీ నుండి ఈనెల 16వ తేదీ వరకు జిల్లాలోని అనేక మండలాల్లో అధికారులు, స్వచ్ఛంద సంస్థలు కలిసి వారోత్సవాలుగా అవగాహన సదస్సులు చేపట్టాయి. ఈ సందర్భంగా ఈరోజు (మంగళవారం) నెల్లూరు జిల్లా కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నందు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా చేతుల మీదుగా వెట్టి చాకిరి నిర్మూలనకు సంబంధించిన గోడ పత్రికలు విడుదల చేశారు. గోడపత్రిక ఆవిష్కరణ అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. నెల్లూరు జిల్లాలో వెట్టి చాకిరి నిర్మూలన కోసం జిల్లా స్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ ఏర్పాటు చేసి ప్రతి మూడు నెలలకు ఒకసారి సమావేశాలు నిర్వహిస్తూ పర్యవేక్షణ కొనసాగిస్తున్నామని తెలిపారు. ఎవరైనా బాల కార్మికులను లేదా ఇతర కార్మికులను వెట్టి చాకిరికి గురి చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు, ఏఆర్డి సంస్థ డైరెక్టర్ షేక్ బషీర్ మాట్లాడుతూ గత వారం రోజులుగా జిల్లాలోని అనేక ప్రాంతాల్లో అవగాహన సదస్సులు నిర్వహించి విస్తృత ప్రచారం చేపట్టామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్మిక శాఖ ఉప కమీషనర్ విజయ్ కుమార్ రెడ్డి, డివిఎంసి సభ్యులు పోలయ్య, బాపట్ల సత్యవతమ్మ, చక్రం శ్వేత, సుదర్శన్, నవజీవన్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు పెంచలయ్య, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

# నులిపురుగుల నివారణ మాత్రలు తప్పనిసరిగా ఇప్పించాలి : కలెక్టర్



**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** చిన్నారుల ఆరోగ్య సంరక్షణ, ఎదుగుదలకు నులిపురుగుల నివారణ మాత్రలను తప్పనిసరిగా అందించాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల వైద్యారోగ్య శాఖ అధికారులకు సూచించారు. జాతీయ నులిపురుగుల దినోత్సవం పురస్కరించుకుని మంగళవారం ఉదయం నెల్లూరు నగరంలోని ఈఎస్ఆర్ఎం హైస్కూల్లో విద్యార్థులకు నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలను కలెక్టర్ అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది సూచి తల మేరకు 1-19 సంవత్సరాల వయసు గల బాల బాలికలు అందరికీ నులిపురుగుల నివారణ మాత్రలు తప్పనిసరిగా అందించాలన్నారు. ఈనెల 24న కూడా ఈ మాత్రల పంపిణీ జరుగుతుందని కలెక్టర్ చెప్పారు. చిన్నారుల్లో ఎదుగుదల, మెరుగైన ఆరోగ్య సంరక్షణకు ఈ మాత్రలు ఎంతో ఉపయోగపడతాయని, తల్లిదండ్రులందరూ కూడా తమ బిడ్డలందరికీ ఈ మాత్రలను తప్పనిసరిగా అందించాలన్నారు. కలెక్టర్ వెంట డిఎంహెచ్వో డాక్టర్ సుజాత, ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ యశ్వంత్, డెమో కనక రత్నం తదితరులు ఉన్నారు.

'కాలం చెల్లిన తినుబండరాల విక్రయం'

# కథనంకు స్పందన



**కలిగిరి, మేజర్‌న్యూస్ :** మండల కేంద్రమైన కృష్ణారెడ్డి పాలెం పాఠశాల ఆవరణంలో 'కాలం చెల్లిన తినుబండారాల విక్రయం' అనే అంశంపై 'సూర్య' పత్రికలో ఆదివారం కథనంలో ప్రచరితమైన అంశంపై మంగళవారం ఆరోగ్యం, ఆహార భద్రత సిబ్బంది స్పందించారు. పాఠశాల ఆవరణలో, చుట్టుపక్కల దుకాణాలను తనిఖీ చేసి కాలం చెల్లిన తినుబండారాలు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆహార, ఆరోగ్య భద్రత సిబ్బంది తెలియజేశారు. ఈ సందర్భంగా 'సూర్య' పత్రిక ప్రతినిధికి అభినందనలు తెలియజేశారు.

సూర్య ఎఫెక్ట్

# శివపార్వతుల కల్యాణం కమనీయం





**పొదలకూరు, మేజర్‌న్యూస్ :** లోకక్షేమార్థం, భక్తజనుల అభీష్టసిద్ధి కోసం పరమేశ్వరుడు పార్వతీదేవితో కలసి దివ్యకళ్యాణం రూపంలో దర్శనమిచ్చిన వేళ పట్టణం ఆధ్యాత్మిక వాతావరణంతో ముంచెత్తింది. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాలుగవ రోజైన మంగళవారం పురాతన శ్రీ వినాయక, కామాక్షితాయి సమేత రామలింగేశ్వర స్వామి దేవస్థానం (శివాలయం)లో శ్రీ కామాక్షితాయి రామలింగేశ్వర స్వామి వారి కళ్యాణ మహోత్సవం భక్తి శ్రద్ధల నడుమ కనులపండుగగా జరిగింది. వేదఘోషల మధ్య,మంగళవాయిద్యాల నినాదాల మధ్య శివపార్వతుల దివ్య వివాహం వైభవోపేతంగా సాగింది. స్థానిక ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వేదపండితులు మంత్రోచ్చారణలతో "ఇదం శివాయ, ఇదం నమమ" అంటూ హోమాగ్నికి ఆహుతులు సమర్పిస్తూ కళ్యాణాన్ని కమనీయంగా నిర్వహించారు. పసుపు, కుంకుమ, తాళిబొట్టు, మంగళసూత్ర ధారణ వంటి శాస్త్రోక్త కర్మలు ఒక్కొక్కటి భక్తులను ఆధ్యాత్మిక ఆనందంలో ముంచెత్తాయి.

### పురాణ ప్రాశస్త్యం

హిమవంతుని కుమార్తె పార్వతీదేవి అనేక యుగాల తపస్సుతో శివుడిని వరించగా, దేవతల సమక్షంలో జరిగిన ఆ దివ్యవివాహమే శివపార్వతుల కల్యాణం. ఈ కల్యాణం జరగడమే సృష్టి, స్థితి, లయల సమతౌల్యానికి సంకేతమని పురాణాలు పేర్కొంటాయి. శివశక్తుల ఐక్యం జగత్తు స్థితికి మూలాధారం. అందుకే ప్రతి శివాలయంలో ఈ దివ్యకళ్యాణాన్ని నిర్వహించడం లోకకళ్యాణార్థమని ఆగమశాస్త్రాలు వివరిస్తాయి.

### మహిళాభక్తుల రద్దీ

ఈ దివ్యసందర్భాన్ని దర్శించేందుకు మహిళాభక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. శివనామస్మరణతో ఆలయం మారుమోగింది. "హర హర మహాదేవ" నినాదాలు భక్తి భావాన్ని రెట్టింపు చేశాయి. కళ్యాణాంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. భక్తులకు అన్నదానం కార్యక్రమాలను తన్నీరు. వెంకటచలపతి, సునీత, కుమారుడు హరీష్ – చందన దంపతులు నిర్వహించారు. భక్తులు ఈ సేవలను అభినందించారు. కార్యక్రమంలో దేవాదాయశాఖ కార్య నిర్వహణాధికారి కె.ప్రసాద్, ప్రధాన అర్చకులు ప్రసాద్ స్వామి, ఆంజనేయ శర్మ, రమేష్ స్వామి, మనోహర్ స్వామి, కుమార్ స్వామి, పట్టణ ఆర్యవైశ్య సంఘం సభ్యులు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# జేఈఈ మెయిన్స్‌లో ఓవెల్ విద్యార్థుల విజయభేరి




**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** జెఈఈ మెయిన్స్ ఫేస్ –1 (2026) పరీక్షలో ఓవెల్ జూనియర్ కళాశాల విద్యార్థులు కొత్త నిర్వచనం ఇచ్చారు. నెల్లూరు మాగుంట లేఅవుట్ ప్రాంతంలోని వేంకటేశ్వర స్వామి గుడి వద్ద గల ఓవెల్ జూనియర్ కళాశాల విద్యార్థులు జాతీయ స్థాయి అత్యున్నత పోటీ పరిక్షలైన జెఈఈ మెయిన్స్ పరీక్షలో అగ్ర ర్యాంకుల విజృంభణలతో అద్భుత ఫలితాలను సాధించారు. సిహెచ్ అనిర్విన్య రెడ్డి 99.58, కే.జోయల్ సుభాష్ 99.23, ఎస్.ధనుంజయ్ రెడ్డి 99.10, వై.సాయి సాత్విక్ 99.09 శాతం సాధించి అసాధారణ ఫలితాలను సాధించారన్నారు. ఈ సందర్భంగా ఓవెల్ విద్యాసంస్థల చైర్మన్, ఓవెల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రంగిశెట్టి వేణు విద్యార్థులను సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జాతీయ స్థాయి మెయిన్స్ ఫలితాలలో ఓవెల్ జూనియర్ కళాశాల సరికొత్త రికార్డు నెలకొల్పిందని హర్షం హర్షం వ్యక్తం చేసారు వీరితో పాటుగా 27 మంది విద్యార్థులు 91 శాతంకు పైగా ఫలితాలను సాధించడంతో పాటు, 40 పైగా విద్యార్థులు జెఈఈ అడ్వాన్స్ పరీక్షకు అర్హత సాధించడం నెల్లూరు పట్టణంలో ఓవెల్ జూనియర్ కళాశాల మాత్రమే సాధించిన అరు అరుదైన రికార్డని తెలిపారు సబ్జెక్ట్ వారీగా "ఫిజిక్స్ 99.85, 99.85, 99.30 నందు కెమిస్ట్రీ 99.17 శాతం సాధించి సామాన్యులను అసామాన్యులుగా మార్చే శక్తి చదువు చదువుకి గ్యారంటీ 'ఓవెల్"అని మరోసారి నిరూపించారని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో ఓవెల్ విద్యాసంస్థల సీఈఓ ప్రమీల, జి.ఎమ్.మహదేవన్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బాలు, డి.జి.ఎమ్స్, హెచ్‌వోడీలు సుధీర్ బాబు, రాము, రఘురామ్, ఏజీఎం అఖిల్, ఎక్సిక్యూటివ్ ఇన్చార్జ్ ఏఎం విద్య, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ఘనంగా శిరిడి సాయిబాబా ఆలయ వార్షికోత్సవ వేడుకలు



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** వింజమూరు చెర్ల తోటలో వెలిసియున్న శ్రీ షిరిడి సాయిబాబా ఆలయ 22వ వార్షికోత్సవ వేడుకలు భక్తజన సందోహం మధ్య అత్యంత వైభవంగా జరిగాయి. బుధవారం శ్రీ శిరిడి సాయిబాబా భక్త బృందం ఆధ్వర్యంలో ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే సాయి బాబావారికి విశేష పాలాభిషేకాలు అలంకరణలో నిర్వహించారు. ఆలయ అర్చకులు బాబాకు మంగళహారతులు సమర్పించి భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. మధ్యాహ్నం వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఆలయ కమిటీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంత్రం రంగురంగుల విద్యుత్ దీపాలతో పూలలతో ఆలయాన్ని కనువిందుగా అలంకరించారు. బాబాకు బాబాకు పూల అలంకరణ నిర్వహించి ప్రత్యేక హారతులు ఇచ్చారు అనంతరం నిర్వహించిన పల్లకి సేవ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. భజన కీర్తనలు సాయిరాం సాయి రాం నినాదాల మధ్య బాబా కు పల్లకి ఊరేగింపు వైభవంగా సాగింది. కార్యక్రమంలో సాయినాథుని సేవకులు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలను స్వీకరించారు.

## నులిపురుగుల నిర్మూలనలో 93 శాతం ప్రగతి

### జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ వి సుజాత



**నెల్లూరు అర్బన్/క్రైమ్, మేజర్‌న్యూస్ :** జాతీయ నులిపురుగుల నిర్మూల దినోత్సవం సందర్భంగా జిల్లాలో అంగన్వాడీ కేంద్రాలు, ప్రభుత్వ/ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో ఆల్బెండజోల్ మాత్రలు మింగించడం జరిగిందని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ సుజాత మంగళవారం తెలియజేశారు. ఈ సందర్భంగా డిఎంహెచ్వో మాట్లాడుతూ.. 1 నుంచి 19 ఏళ్లలోపు ఉన్న 5,75,806 మంది పిల్లల్లో 5,35,499 మందికి నులుపురుగులు మందు మింగించి 93 శాతం ప్రగతి సాధించామని, మిగిలిన పిల్లలకు ఈనెల 24న మాపప్ రౌండ్‌లో మందులు మింగించనున్నట్లు చెప్పారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన విద్యాశాఖ, స్త్రీ శిశు సంక్షేమ శాఖ, వైద్య ఆరోగ్యశాఖలకు డిఎంహెచ్వో కృతజ్ఞతలు తెలిపారు.

## విద్యార్థులకు శక్తి టీం అవగాహన




**అనుమసముద్రంపేట, మేజర్‌న్యూస్ :** ఏఎస్పేట మండల కేంద్రంలో ఉన్న జిల్లా పరిషత్ పాఠశాల లో విద్యార్థులకు శక్తి టీం, హెడ్ కానిస్టేబుల్ వెంగయ్య, ఏఎస్ఐ భాస్కర్‌రెడ్డి, ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్ర మంలో భాగంగా విద్యార్థులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్, క్రమశిక్షణ, నైతిక విలువలు గురించి వివరించి అవగాహన కల్పించారు. అలాగే గుర్తు తెలియని వ్యక్తులతో జాగ్రత్తగా ఉండడం, ఇంటి చుట్టుపక్కల అపరిచి తులు ఇచ్చే తినుబండారాలు తీసుకోకూడదని సూచించారు. అదనంగా మొబైల్ ఫోన్‌ను అధికంగా వినియోగించడం వల్ల కలిగే నష్టాలు, వంటి అంశాలపై చట్టపరమైన అవగాహన కల్పించారు. అత్యవసర పరిస్థితుల్లో చైల్డ్ లైన్, 1098, పోలీస్ హెల్ప్ లైన్, 112 నంబర్లను సంప్రదించా లని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రుక్మిణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాల్గొన్నారు.

## ఏఎస్ పేట కేజీబీవీని ఆకస్మిక తనిఖీ



**అనుమసముద్రంపేట, మేజర్‌న్యూస్ :** ఏఎస్ పేట మండల కేంద్రంలో ఉన్న కస్తూర్బా బాలికల విద్యాలయాన్ని జిల్లా సమగ్ర శిక్ష అభియాన్ టీం మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు.ఇందులో భాగంగా 6వ తరగతి నుండి ఇంటర్ వరకు చదువుతున్న విద్యార్థినిల శక్తిసామర్థ్యాలు పరీక్షించి ఉపాధ్యాయులకు, విద్యార్థులను మెరుగుపరచాలని తగు సలహాలు సూచనలు చేశారు. అలాగే జిల్లా నుండి తనిఖీకి వచ్చిన జిల్లా అధికారులు టీం, విద్యాలయానికి సంబంధించి ప్రొవిజన్ స్టోర్ రూమ్, క్యాష్ బుక్ పరిశీలించి సంతృప్తి చెందారు. అలాగే రాత్రి భోజనం రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా టీం నుండి జిసిడిఓ వైశాంతకుమారి, సీనియర్ లెక్చరర్ నాగరాజు మూర్తి, సీనియర్ లెక్చరర్ హైమావతి, ప్రిన్సిపాల్ లక్ష్మమ్మ ఉన్నారు.